Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 | సంచిక : 256 | పేజీలు 8 | వెల : 5 | ఫిబ్రవరి 19 బుధవారం 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| మల్టీకలర్ | బ్లాక్ & వైట్ పేజి |
|---|---|
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఫ్రంట్ పేజి : 30,000/- |

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

## రాష్ట్ర ఆర్థికపరిపుష్టికి ఆక్వా గ్రోత్ ఇంజిన

ఆక్వాలోనూ ప్రకృతి సేద్యం సాధించాలి

ఆక్వాటెక్ ముగింపు ఉత్సవంలో సిఎం చంద్రబాబు



# ఆక్వాలో టెక్నాలజీ జోడిస్తే మంచి ఫలితాలు

**అమరావతి:**టెక్నాలజీ వాడకంతో అక్వా రంగంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిపుష్టికి ఆక్వారంగం గ్రోత్ ఇంజన్‌గా నిలుస్తుందన్నారు. టెక్నాలజీ వాడకం, నూతన పద్ధతులతో ఈ రంగంలో నిలకడగా 30 గ్రోత్‌రేట్ సాధ్యమేనన్నారు. ఆక్వాలో ప్రకృతి సేద్యంతో ప్రపంచ వ్యాప్తంగా మన ఉత్పత్తులకు డిమాండ్ ఏర్పడుతుందని సీఎం వివరించారు. ప్రకృతి సేద్యం ద్వారా వ్యవసాయంలో మంచి ఫలితాలు వస్తున్నాయని.. ఆక్వాలో కూడా ఆ తరహా విధానాలు అమలు చేయాలన్నారు. ఆక్వా ఫీడ్ విషయంలో తగు మార్పులు చేయాలని అన్నారు. మన ఉత్పత్తులకు వ్యాల్యూ యాడ్ చెయ్యడం ద్వారా రైతులు ఎక్కువ ఆదాయం పొందవచ్చని సీఎం చెప్పారు. ప్రస్తుతం 4 లక్షల ఎకరాల్లో ఆక్వాను సాగు చేస్తున్నారని.. 2029-30నాటికి 10 లక్షల ఎకరాలకు పెరగాలని సీఎం ఆకాంక్షించారు. అయితే కాలుష్య రహితంగా ఆక్వా ప్రయాణం సాగాలన్నారు. ఆక్వాలో ప్రధాన సమస్యగా ఉన్న కాలుష్యానికి పరిష్కార మార్గాలు ఉన్నాయని.. వాటిని రైతులు, ఉత్పత్తి దారులు పాటించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ సాగు వివరాలను రిజిస్టర్ చేసుకోవాలని.. అలా కాకుండా ఇష్టానుసారంగా చేస్తానంటే మాత్రం నిబంధనల ప్రకారం వ్యవహరిస్తామని చెప్పారు. ఆక్వాకు ప్రాధాన్యం అనేది తమ అభిమతమన్న సీఎం.. నిబంధనల అమలకు కూడా అంతే ప్రాధాన్యం ఇస్తామని...పొల్యూషన్ విషయంలో కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు. మూడు రోజుల పాటు విజయవాడలోని హోటల్‌లో జరిగిన ఆక్వా టెక్ 2.0 కాన్ క్లేవ్ చివరి రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. జిఎఫ్ఎస్‌టి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఆక్వారంగంలో వస్తున్న మార్పులు, అవకాశాలు, సమస్యలు, పరిష్కారాలు, పాలసీలు, టెక్నాలజీ సహకారం వంటి అంశాలపై చర్చించారు. రైతులు, ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల యజమానులు, ట్రేడర్లుతో పాటు నిపుణులు ఈ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్నారు. రాష్ట్రానికి ఆక్వాను ప్రధాన ఆదాయ వనరుగా మార్చేందుకు ఉన్న అవకాశాలు, అధిగమించాల్సిన అవరోధాలపై ఈ సదస్సుల్లో చర్చించారు. రైతులను చైతన్య పరిచేలా.. టెక్నాలజీ వాడకం పెంచేలా మూడు రోజుల పాటు పలు అంశాలపై ఇక్కడ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. 'ఆక్వా రంగంపై నాకు ప్రత్యేక మైన శ్రద్ధ ఉంది.. మన రాష్ట్రం ఆక్వా సాగుకు అత్యంత అనుకూలం. 2014-19 మధ్య కాలంలో నాడు ఆక్వా రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా నిలిచింది. రాష్ట్ర జీవీఎ(స్థూల విలువ జోడింపు)లో 8.8 శాతం ఆక్వా వాటాగా ఉంది. వియత్నాం వంటి దేశాల్లో మన కంటే తక్కువ ప్రొడక్షన్ ఉన్నా.. వాల్యుయేషన్?లో వాళ్లు ముందు ఉన్నారు. వియత్నాం ఆక్వా ఉత్పత్తుల్లో 3.9 మిలియన్ టన్నుల ఎగుమతులతో 13 బిలియన్ డాటర్లు ఆర్జిస్తుండగా, మనం 5 మిలియన్ మెట్రిక్ టన్నులు ఎగుమతి చేస్తూ 3 బిలియన్ డాలర్లు మాత్రమే ఆర్జిస్తున్నాం. మనం కూడా ఆ దిశగా ప్రయాణం చేయడానికి ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయి. మన ఉత్పత్తులను ప్రాసెస్ చేయడం ద్వారా మంచి ధరలు పొందవచ్చు.

# విద్యారంగంలో సమూల మార్పులకు యోచన

### స్కిల్స్ పెంచేలా పాఠ్యాంశాల్లో మార్పులు

### సింఘానియా స్కూల్స్‌తో ఒప్పందంలో మంత్రి లోకేశ్



అమరావతి:విద్యార్థుల్లో స్కిల్స్ పెంచేలా విద్యావిధానంలో మార్పులకు కృషి చేస్తున్నామని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అందుకు అనుగుణంగా మార్పులు చేస్తున్నామని అన్నారు. ఏపీలో విద్యారంగాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు అమలు చేస్తోన్న మూస పద్ధతులకు స్వస్తి చెప్పి సృజనాత్మకత పెంపొందించేలా కేజీ టు పీజీ విద్య కరిక్యులమ్‌లో సమూల మార్పులు తెస్తున్నామన్నారు. కళాశాల నుంచి బయటకు వచ్చే విద్యార్థికి వెనువెంటనే ఉద్యోగం లభించేలా నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. జాతీయ విద్యావిధానం లక్ష్యసాధనలో భాగంగా రాష్ట్రంలో విద్యానైపుణ్యాలు అభివృద్ధి చేసేందుకు సులోచనాదేవి సింఘానియా స్కూల్ ట్రస్ట్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఏపీ ప్రభుత్వంతో సింఘానియా గ్రూప్, ఏపీ ప్రభుత్వ ప్రతినిధుల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. తిరుపతి జిల్లాలోని 14 పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు, నాణ్యత, ఉపాధ్యాయ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణతో పాటు జాతీయ విద్యావిధానంతో సమాంతరంగా సాంకేతికత అనుసంధానం వంటి అంశాల్లో విద్యా నైపుణ్యాన్ని తీసుకురావడం ద్వారా పాఠశాలల నిర్వహణలో మార్పులు తేవాలని నిర్ణయించారు. ఐదేళ్ల వ్యవధిలో అమలుచేసే ఈ కార్యక్రమం ద్వారా లక్ష మంది విద్యార్థులకు మెరుగైన విద్య అందనుంది. ఆ తర్వాత అమరావతి, విశాఖపట్నం, కాకినాడకు కూడా ట్రస్ట్ సేవలను విస్తరించ నున్నారు. విద్యార్థులను ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యవంతం గా తయారు చేయడమే లక్ష్యమని సింఘానియా గ్రూప్ చైర్మన్ తెలిపారు. విద్యార్థులకు మరింత ప్రభావవం తమైన, ఆకర్షణీయమైన అభ్యసన విధానాల్లో బోధన చేసేందుకు వీలుగా ఉపాధ్యాయుల సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు విజయవాడ, వైజాగ్, అమరావతిలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. పాఠ్యాంశాల్లో సాంకేతికతను మెరుగుపరచడం, ఆంగ్లంలో విద్యార్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలను బలోపేతం చేయడం ద్వారా విద్య నాణ్యతను పెంచడమే లక్ష్యమని పేర్కొన్నారు.



## తునిలో వైకాపా, టిడిపి వర్గాల మధ్య ఘర్షణ

**కాకినాడ:**కాకినాడ జిల్లా తుని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక నేపథ్యంలో అక్కడికి చేరుకున్న వైకాపా కౌన్సిలర్లను తెదేపా శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో ఇరువర్గాలు మళ్లీ గొడవకు దారితీసింది. దీంతో వారు వెనుదిరిగి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంటికి వెళ్లారు. మరోవైపు 'చలో తుని'కి దాడిశెట్టి రాజా పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమానికి అనుమతి లేదని హెచ్చరించారు. తుని మున్సిపాలిటీ పరిధిలో సెక్షన్ 163 (2) అమలు చేస్తున్నారు. సభలు, సమావేశాలు, ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడటంపై నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో అనుచరులతో కారులో తుని వెళ్తున్న వైకాపా నేత ముద్రగడ పద్మనాభరెడ్డి, మాజీ ఎంపీ వంగా గీతను పోలీసులు అడ్డుకుని వెనక్కి పంపారు. సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి.సోమవారం కోరం లేకపోవడంతో వైస్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన నేపథ్యంలో నేడు మరోసారి నిర్వహించను న్నారు. ఇప్పటికే జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అక్కడికి చేరుకున్నారు. తెదేపా శ్రేణులు భారీగా తరలి రావడంతో మున్సిపల్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. వైకాపా కౌన్సిలర్లను మాజీ మంత్రి దాడిశెట్టి రాజా కిడ్నాప్ చేశారని తెదేపా నేతలు ఆరోపిస్తున్నారు.

## అబద్దాలు చెప్పడంలో జగన్‌కు డాక్టరేట్

### టిడిపి కార్యాలయంపై దాడి చేసి అబద్దాలా?

### కౌంటర్ అటాక్ చేస్తూ ఎక్స్ వేదికగా లోకేశ్ పోస్ట్



**అమరావతి:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అబద్దాలు చెప్పడంలో పిహెచ్‌డి చేసినట్లు ఉన్నారని మంత్రి నారా లోకేష్ ఎదురుదాడితో వ్యాఖ్యలు చేశారు. అబద్దాలకు కూడా ఓ హద్దు ఉందని ఎక్స్ వేదికగా ఖండించారు. విజయ వాడ జైలులో ఉన్న వల్లభనేని వంశీని పరామర్శించిన తర్వాత జగన్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం, టీడీపీపై విమర్శలు చేశారు.. వంశీపై తప్పుడు కేసులు పెట్టారని జగన్ వ్యాఖ్యానించారు.. ఇక, జగన్ వ్యాఖ్యలపై సోషల్ మీడియా వేదికగా.. స్పందించారు నారా లోకేష్.. జగన్ వ్యాఖ్యలు.. గతంలో గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై దాడి దృశ్యాలను కలిపి వీడియో షేర్ చేసిన లోకేష్.. 'నిజం చెబితే తల వెయ్యి ముక్కలు అవుతుందనే శాపం మీకేమైనా ఉందా జగన్ రెడ్డి గారు' అంటూ ఎద్దేవా చేశారు.. పచ్చి అబద్దాలను కాన్ఫిడెంట్ గా చెప్పడంలో మీరు పీహెచ్‌డీ చేసినట్టు ఉన్నారు అంటూ దుయ్యబట్టారు.. మీరు ఏం చెప్పినా ప్రజలు నమ్ముతారు అనే భ్రమలోంచి ఇకనైనా బయటకు రండి అని సూచించారు.. 100 మందికిపైగా వైసీపీ రౌడీలు తెలుగుదేశం పార్టీ కార్యాలయం పై దాడి చేయడం కోట్లాది ప్రజలు కళ్లారా చూశారని గుర్తుచేశారు.. కక్ష సాధింపు, కుట్రలు, కుతంత్రాలు మీ బ్రాండ్ జగన్ రెడ్డి గారు. అధికారం ఉన్నప్పుడు యథేచ్చగా చట్టాలను తుంగలో తొక్కి ఇప్పుడు ప్రజాస్వామ్యం, పద్ధతులు అంటూ మీరు లెక్చర్ ఇవ్వడం వింతగా ఉంది అంటూ మండిపడ్డారు మంత్రి నారా లోకేష్..

# జైలులో ఉన్న వంశీని పరామర్శించిన వైఎస్ జగన్



**అమరావతి:** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం ఉదయం విజయవాడ జైలు వద్దకు వెళ్లారు. రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీతో జగన్ ములాఖత్ అయ్యారు. గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో సాక్షులను బెదిరించారన్న కేసులో వంశీ అరెస్ట్ అయి జైలులో ఉన్న విషయం తెలిసిందే. జైలులో వంశీని జగన్ పరామర్శించారు. జగన్‌తో పాటు వంశీని కలిసిన వారిలో తలశిల రఘురాం, వంశీ సతీమణి పంకజశ్రీ ఉన్నారు. అయితే మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్నినానికి విజయవాడ జిల్లా జైలలోకి వెళ్లేందుకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ములాఖత్‌లో వంశీని పరామర్శించేందుకు జగన్‌తో కలిసి కొడాలి నాని, పేర్ని నాని పేర్లు ఇచ్చారు వైసీపీ నేతలు. అయితే వీరిద్దరు వంశీని పరామర్శించేందుకు అనుమతి నిరాకరించారు. భద్రతా కారణాలతో పేర్ని నాని, కొడాలి నానికి అనుమతి ఇవ్వలేమన్న జైల్ అధికారులు స్పష్టం చేశారు. జగన్‌తో పాటు వంశీని కలిసేందుకు సింహాద్రి రమేష్‌ను మాత్రమే జైల్లోకి వెళ్లేందుకు అనుమతించారు పోలీసులు. వంశీని పరామర్శించేందుకు జగన్ జిల్లా జైలుకు వచ్చిన నేపథ్యంలో ఆ మార్గంలో ఎవరూ రాకుండా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. అనప్పటికీ వైసీపీ కార్యకర్తలు మాత్రం బారికేడ్లను తోసుకుని మరీ జైలు గేటు వద్దకు చేరుకున్నారు.



# కెసిఆర్ హయాంలో రైతు దర్జాగా బతికాడు

ఇప్పుడేమో బిచ్చమేసినట్లుగా రైతుభరోసా

రుణమాఫీ పేరుతో రైతులకు టోకరా

15వేలు అని చెప్పి అన్నదాతలను మోసం చేశారు

ఏడాది దాటినా ఎవ్వరికీ ప్రయోజనం లేదు

ఆమనగల్ రైతు ధర్నాలో కెటిఆర్ విమర్శలు

2లో..

రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అవమానపరిచేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పచ్చకామెర్ల వానికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది. మీరు బ్యాగులతో దొరికారని అందరూ మీ లాగానే బ్లాక్‌మెయిల్ దందాలు చేస్తారని సెటిల్‌మెంట్లు, దందాలు చేస్తూ బతుకుతున్నారని అనుకోవడం తప్పు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు మన దేశ ప్రజాస్వామ్యానికి వెన్నెముకలు అని కేటీఆర్ పేర్కొన్నారు. సివిల్ సర్వెంట్స్ అంటే.. కార్యాచరణ రూపొందించడంలో నిష్ణాతులు.. కానీ ఏసీలో ఉండి యాక్షన్ చేసే వారు కాదు. సీఎం రేవంత్ రెడ్డి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అవమానించేలా మాట్లాడారు. ఆ మాటలు అమర్యాదగా ఉన్నాయని కేటీఆర్ మండిపడ్డారు. అధికార వ్యవస్థ ప్రతిష్టను నాశనం చేసేందుకు సీఎం రేవంత్ నిరంతరం చేస్తున్న ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కేటీఆర్ తెలిపారు.

# సైబర్ నేరాల నియంత్రణకు అధిక ప్రాధాన్యం

ఎక్కడో ఉండి చేసే నేరాలే సవాల్‌గా మారాయి

సైబర్ నేరాలను అరికట్టేందుకు 7 కొత్త పోలీసు స్టేషన్లు

సొమ్ము రికవరీలో సైబరాబాద్ పోలీసుల ముందంజ

ప్రత్యేకమైన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు

'షీల్డ్ 2025'లో కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

2లో..



# సైబర్ నేరాల నియంత్రణకు అధిక ప్రాధాన్యం




**హైదరాబాద్:** నేరాల శైలీ మారుతోంది, దానికి అనుగుణంగా ప్రజలు, ప్రభుత్వం మారాల్సి ఉందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణలో ప్రత్యేకంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి అన్నారు. సైబర్ నేరాల పరిష్కారం కోసం హెచ్ఐసిసిలో ఏర్పాటు చేసిన 'షీల్డ్ 2025'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సైబర్ నేరాల్లో కోల్పోయిన సొమ్ముని తిరిగి తీసుకురావడంలో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారని అన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు గత ఏడాది 7 కొత్త పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశాం. ఒకప్పుడు ఇంట్లో ఉండే సొమ్మును దొంగలు దోచుకొనేవారు.. కానీ ఇప్పుడు ఏక్కడి నుంచి దోపిడి చేస్తున్నారో తెలుసు కోవడం కష్టంగా మారిపోయిందన్నారు. సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో ప్రత్యేకమైన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశాం. సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారు. అయితే నేరం ఎక్కడి నుంచి ఎవరు చేశారో కనుక్కోవడం పెద్ద సవాలుగా మారింది. నేరాల శైలి మారుతోంది. వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజలు, ప్రభుత్వం మారాలని అన్నారు. దేశంలోనే సైబర్ సేఫ్టీలో మన రాష్ట్రాన్ని నంబర్ వన్ గా నిలపడమే మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మొదటిసారి ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్‌ను సిఎం రేవంత్ అభినందించారు. తెలంగాణను నంబర్ వన్ సైబర్–సేఫ్ స్టేట్‌గా మార్చడానికి కలిసి పనిచేస్తున్న మీ అందరినీ ఇక్కడ కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో సైబర్ నేరగాళ్లు గత ఏడాది రూ. 22,812 కోట్లు దోచుకున్నారని ఒక అంచనా. ఇది మన ఆర్థిక వ్యవస్థకు, మన పౌరులకు ముప్పు. ఈరోజుల్లో ఫేక్ న్యూస్ అనేది మరో ప్రధానమైన ముప్పు. సోషల్ మిడియాలో తప్పుడు సమాచారంతో సమాజంలో గందరగోళం ఏర్పడుతుంది. సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ కోసం ఎకో సిస్టమ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు... మా ప్రభుత్వం నిపుణులు, ఏఐ సంస్థలతో కలిసి పనిచేయడానికి, అన్ని రకాల వనరులు సమకూరుస్తోంది. మనం తెలంగాణను సెక్యూర్ బిజినెస్ హబ్ గా మార్చాల్సి ఉందన్నారు. 1930 నంబర్ ను అందరికీ షేర్ చేయాలని ప్రతీ ఒక్కరినీ కోరుతున్నా.. ఇది 24/7 సైబర్ హెల్ప్‌లైన్ అని అన్నారు. పూర్తిస్థాయిలో పనిచేసే సైబర్ సెక్యూరిటీ బ్యూరో, పౌరులను రక్షించడానికి అంకితమైన సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ ఉన్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని సిఎం అన్నారు. ఈక్రమంలో సమాజంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కోవడానికి అన్ని రకాల ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సైబర్ క్రైం ను నియంత్రించడంలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉంది. కానీ సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేరం జరిగిన తరువాత పట్టుకోవడం కాదు.. నేరం జరగకుండా నిరోధించేలా చూడాల్సి ఉందన్నారు. కొంతమంది సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ ను ప్రచారం చేస్తున్నారు. ఫేక్ న్యూస్ తో పాటు ఆర్థిక నేరాలను కూడా నిరోధించాల్సిన అవసరం ఉంది. సైబర్ క్రైమ్ నియంత్రణలో తెలంగాణను దేశానికే రోల్ మోడల్ గా తీర్చిదిద్దుదామని అన్నారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. 'సాంకేతికతతో మరిన్ని అవకాశాలు లభిస్తాయి. అయితే దానితో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. డీప్‌ఫేక్, ర్యాన్సమ్‌వేర్, మాల్‌వేర్ వంటివి ఆందోళన కలిగిస్తున్నాయి. సాంకేతికత రెండు వైపులా పదును ఉన్న కత్తిలాంటిది. సైబర్ దాడుల వల్ల ఎన్నో వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. ఇటీవల ఎయిమ్స్‌పై సైబర్ దాడి జరిగింది. అమెరికాలో జరిగిన సైబర్ దాడితో విమాన రాకపోకలు స్తంభించాయి. సైబర్ నేరాల వల్ల రూ.15 వేల కోట్లను భారత్ నష్టపోతోంది' అని మంత్రి అన్నారు. 14 రాష్ట్రాల నుంచి పోలీసు అధికారులు ఈ కాన్‌క్లేవ్‌కు హాజరు కావడం ఆనందంగా ఉందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. 'సైబర్ నేరాలు యూనివర్సల్ ఛాలెంజ్‌గా మారాయి. వీటిని అరికట్టేందుకు ఈ కాన్‌క్లేవ్ ఒక మంచి వేదిక. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాం. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితనానికి కేంద్రం అవార్డులు కూడా ఇచ్చింది. 2024లో సైబర్ నేరాల్లో కాజేసిన రూ.350 కోట్లు సీజ్ చేస్తాం. రూ.183 కోట్లను 18 వేల మంది బాధితులకు అందించాం' అని వివరించారు. ఈ సమావేశంలో 14 రాష్ట్రాల నుంచి పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశం ఇంత విజయవంతం కావడం చాలా సంతోషంగా ఉందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. 2024లో సైబర్ నేరాల్లో కాజేసిన రూ.350 కోట్లను సీజ్ చేశామని.. అందులో రూ.183 కోట్లు 18 వేల మంది బాధితులకు అందించామని పేర్కొన్నారు.

# కెసిఆర్ హయాంలో రైతు దర్జాగా బతికాడు



**రంగారెడ్డి:**పదేండ్ల పాటు కేసీఆర్ హయాంలో రైతు ఒక రాజులాగా బ్రహ్మాండంగా బతికాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పదిహేను నెలల కాలంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఎవరికీ న్యాయం చేయలేదు. రైతు రుణమాఫీ, రైతుబంధు, తులం బంగారం, మహిళలకు రూ. 2500 రాలేదు. 420 హామీలిచ్చి దొంగమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాడని విమర్శలు గుప్పించారు. రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్‌లో ఏర్పాటు చేసిన రైతు దీక్షలో కేటీఆర్ ప్రసంగించారు. సొంత నియోజకవర్గం, సొంత తాలుకాలో కూడా ఒక్కపని చేయలేదు. సొంతూరికి, అత్తగారి ఊరికి ఏం చేసిండో అడుగదామని వచ్చానని కేటీఆర్ తెలిపారు. రూ. 2 లక్షల రుణమాఫీ చాలా మందికి కాలేదు. రైతుబంధు కూడా రాలేదు. టకీటకీమని పైసలు పడలేదు. గత 6 నెలల నుంచి అన్ని జిల్లాల్లో తిరుగుతున్నాం. గత పదేండ్లలో మోటార్లు కాలలేదు.. ట్రాన్స్‌ఫార్మర్లు పేలలేదు. అప్పుడు అప్పు అడిగే పరిస్థితి లేదు. నాట్లు వేసే నాటికి రైతుబంధు పడుతుండే. రేవంత్ రెడ్డి కొత్త పదం పట్టుకుని టకీ టకీమని పడుతాయ్ అన్నాడు. టకీ లేదు టుక్ లేదు అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రైతుబంధు కేసీఆర్ బిచ్చమేసినట్లు రూ. 10 వేలు ఇస్తుండు.. నేను రూ. 15 వేలు వేస్తా అన్నాడు. కనీసం 10 శాతం మందికి కూడా రైతుబంధు ఇవ్వలేదు. ఒకేసారి రుణమాఫీ చేస్తా అని అన్నాడు. చారణా కూడా రుణమాఫీ చేయలేదు. 10 శాతం మందికి కూడా బోనస్ పడలేదు అని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పాలనతో ఏ వర్గమూ సంతోషంగా లేదని కేటీఆర్‌అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని ఆ పార్టీ నేతలు మళ్లీ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు మళ్లీ మోసపోతే ఎవరూ కాపాడలేరన్నారు. 'కేసీఆర్ హయాంలో రైతు రాజులా బతికాడు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక సోనియాగాంధీ పుట్టినరోజు రెండుసార్లు వచ్చింది.. కానీ రుణమాఫీ 25 శాతం కూడా కాలేదు. 35 సార్లు ఢిల్లీ విమానం ఎక్కారు.. 35 పైసలూ తీసుకురాలేదు. అప్పులు కట్టలేదని రైతుల తలుపులు ఎత్తుకెళ్లారు.. రేపో మాపో పుస్తెలతాడు కూడా లాక్కెళ్లిపోతారు. ఓట్ల కోసం ఇంటికి వచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయాలి. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ అని డ్రామాలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ తప్ప స్టేట్ గురించి తెలియదు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌తో పాటు సొంత ఊరు, అత్తగారి ఊరు కల్వకుర్తిలో ఏమైనా చేశారా? అని అడగడానికి ఇక్కడకు వచ్చాం. కులగణన పేరుతో బీసీలను రేవంత్‌రెడ్డి మోసం చేశారు' అని కేటీఆర్ ఆరోపించారు. మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విభజన సమస్యల పరిష్కారానికి ఇదే సమయం

**రాజమండ్రి:** ఏపీకి పవన్ కల్యాణ్ ఆశాజ్యోతిగా కనిపిస్తున్నారని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. రాజమండ్రిలో మీడియాతో మాట్లాడిన ఉండవల్లి.. . ఇప్పుడు రాష్ట్ర అవసరాలు, విభజన హామీలు సాధించుకోవడానికి మంచి అవకాశాలు ఉన్నాయి.. మన రాష్ట్రం మీద ఆధారపడి కేంద్రం వుంది. ఇదే అదును.. ఇప్పుడే డిమాండ్స్ సాధించుకోవాలి.. కాంగ్రెస్ ప్రభుత్వం అయితే లా ప్రకారం వెళ్తుందనే నమ్మకం నాకుంది.. కానీ, విభజన సమయంలో కాంగ్రెస్ తప్పు చేసిందన్నారు.. ఇక, మంచి ఐడియల్ సమయం ఇది.. చంద్రబాబు టాక్టిస్ ఏ వ్యక్తికి ఎవ్వరికీ ఉండరు.. ముక్కుసూటిగా వెళ్లే వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఆయన తలచుకుంటే విభజన సమస్యలు పరిష్కారం అవుతాదనే నమ్మకం నాకుంది.. దీనిపై పవన్ కు లేఖ కూడా రాశాను అని వెల్లడించారు.. విభజన హామీలో 75 వేల 50 కోట్లు రాష్ట్రానికి రావాలి.. దీనిపై పార్లమెంటులో ప్రస్తావించమని కోరాను అన్నారు ఉండవల్లి.. కేంద్రంతో పవన్ కల్యాణ్ మాట్లాడితే పరిష్కారం వుంటుందన్న ఆయన.. పవన్ కల్యాణ్ సాధిస్తారనే నమ్మకం ఉంది.. ఇందులో సాధించడానికి లోక్‌సభకు నోటీసు ఇవ్వాలి.. నోటీసు ఎలా ఇవ్వాలో కూడా లేఖలో పేర్కొన్నాను.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దీనిపై చర్చించడానికి సిద్ధం అని చాలా సార్లు చెప్పారు .. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పార్లమెంటులో చర్చించే నిర్ణయం తీసుకోవాలి.. విభజన బిల్లు పార్లమెంటులో ఆమోదం చేసిన రోజు ఇదే.. 1 లక్ష 42 వేల 600 కోట్లు ఇంకా పంచలేదు. 42 శాతం వాటా తెలంగాణకు వెళ్తుందన్నారు.. ప్రభుత్వ రంగ సంస్థలు విభజించ లేదు.. ఎందుకో ఆశ పవన్ కల్యాణ్ మీద వుంది.. గతంలో విభజన హామీలు పై పవన్ ఫాక్ట్స్÷రైడింగ్ కమిటీలో 2 గంటలు చర్చించాం.. పవన్ స్పందిస్తే దీని మీద సుప్రీం కోర్టు లో వున్న విభజన కేసులకు తాను తిరగడం తగ్గుతుందన్నారు.. ఇక, తాను పవన్ కల్యాణ్ గురించే మీడియా సమావేశం ఏర్పాటు చేశానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్..

## రంజాన్ మాసంలో ప్రత్యేక ఏర్పాట్లు



**హైదరాబాద్:** మార్చి 2వ తేదీ నుండి ప్రారంభమయ్యే రంజాన్ మాసంలో చేయాల్సిన ఏర్పాట్ల పై డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రంజాన్ మాసంలో తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు దిశా నిర్దేశర చేశారు. ఈ సందర్భంగా.. జీహెచ్ఎంసీ రంజాన్ నెలలో నగరంలో పరిశుభ్రత విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. మసీదు, ఈద్గాల వద్ద ప్రత్యేక శానిటేషన్ బృందాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీధి దీపాలు మరమత్తులు, తాత్కాలిక లైట్లు ఏర్పాటు చేస్తామని జీహెచ్ఎంసీ కమిషనర్ చెప్పారు. అలాగే.. రోడ్ల మరమత్తులు పూర్తి చేస్తామని వెల్లడించారు. మక్కా మసీద్, రాయల్ మాస్క్, మిరాలం ఈద్గా వద్ద ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. రాత్రి సమయంలో దోమల నివారణకు జీహెచ్ఎంసీ ఎంటమాలజీ టీం ద్వారా ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అన్ని డిపా÷–టం÷–మెంట్స్ కలిపి ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారులను నియమించి సమన్వయం చేస్తున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ తెలిపారు. మసీదులు, ఈద్గాల వద్ద వాటర్ ప్యాకెట్స్ ఏర్పాటు, తాగునీటి అవసరాల దృష్ట్యా ప్రత్యేక ట్యాంకర్లు ఏర్పాటు.. మసీదులకు వెళ్లే దారిలో డ్రైనేజీల రిపేర్ పూర్తి చేస్తున్నామని వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. వేసవికాలం దృష్ట్యా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో రంజాన్ నెలలో మొబైల్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ తగ్గ సప్లై ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. మసీదుల వద్ద ఈద్గాల వద్ద విద్యుత్ ఎమ్జ్గ÷న్సీ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మసీదుల వద్ద టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు క్యూలైన్ల కోసం బారికేట్లు ఏర్పాటు చేయడానికి ఆర్అండ్‌బీ విభాగం సిద్ధంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. రంజాన్ నెల నేపథ్యంలో ప్రజలకు పాల ఇబ్బందులు లేకుండా ఉండడానికి అవసరాలకు తగిన పాలను సరఫరా చేస్తామని డైరీ అధికారులు తెలిపారు. ముస్లిం ఉద్యోగులకు సాయంత్రం నాలుగు గంటలకే విధులు ముగించేలా ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశామని జేఏడీ అధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలిపారు. రంజాన్ పండగ దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా షాపింగ్ చేసుకోవడానికి ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ అర్ధరాత్రి వరకు వీధి వ్యాపారాలు కొనసాగించడానికి అనుమతించాలని పోలీస్ అధికారులను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విజ్ఞప్తి చేశారు. రంజాన్ పండుగ దృష్ట్యా ట్రాఫిక్ పేరుతో ఇబ్బందులు కలిగించకూడదని కోరారు. పండగ రోజు ట్రాఫిక్ మళ్లింపులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పండగ దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వైద్య అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని.. ఈద్గాలు, మసీదుల వద్ద హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని.. నిరంతరం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రంజాన్ నెలలో ముస్లిం సోదరులకు పండగ నిర్వహించుకోవడానికి సమయానికి రేషన్ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# నివురుగప్పిన అవినీతి నిప్పు !

మంత్రులు కమిషన్లు లేనిదే పనిచేయడం లేదన్న బిజెపి ఆరోపణలు..ఇప్పుడు కాంగ్రెస్ పనితీరుపై అనుమానాలను రేకెత్తిస్తోంది. ప్రతి పనికి 10 నుంచి 15 శాతం కమిషన్ ముట్టచెప్పుకోవాల్సిన దౌర్భాగ్యం ఏర్పడిందని అంటున్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపి ఈటెల రాజేందర్ తదితరులు తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఇది నిజమా అని ఆలోచించే సమయం ఆసన్నమయ్యింది. కెసిఆర్ ప్రభుత్వ అవినీతి గురించి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. అలాగే కాంగ్రెస్ అధిష్టానం కూడా నిధుల కోసం తెలంగాణపై ఆధారపడుతోందన్న విమర్శల్లో నిజం లేకపోలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ పెద్దలను సంతృప్తి పరిచేందుకు ఇక్కడ కమిషన్ల కక్కుర్తి మొదలయ్యిందన్న ఆరోపణలు నిజంగానే బాధ కలిగించేవిగా ఉన్నాయి. ఓ రకంగా విపక్ష బిఆర్ఎస్‌కు ఇది అందివచ్చిన అస్త్రం. ఏమాత్రం సమాచారం దొరికినా పట్టుకుని ఏకిపారేసేందుకు వారు సిద్దంగా ఉన్నారు. ఇకపోతే బిల్లులు మంజూరుకు ఓ మంత్రి భార్య నేరుగా కమిషన్లు డిమాండ్ చేస్తోందని కూడా అక్కడా ఇక్కడా గ్రామాల్లో కూడా జనం చర్చించు కుంటున్నారు. బిఆర్ఎస్ అవినీతిపై పోరాడుతున్న కాంగ్రెస్ తానే ఈ బురదలో కూరుకుంటే ఇక చేసేదేమీ లేదు. అలాగే కేంద్రానికి కప్పం కట్టేందుకు అవినీతి కూపంలో దిగితే ప్రజలు గమనిస్తూనే ఉంటారు. బిఆర్ఎస్ ఇలా చేసే మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు బిఆర్ఎస్‌ను అవినీతి పార్టీగా ముద్రవేసి పాలన చేస్తున్న కాంగ్రెస్ కూడా మూల్యం చెల్లించుకోక తప్పదు. తప్పులెన్నువారు తమ తప్పులెరుగరయా ..అని సామెత ఉంది. చేసిన తప్పులన్నీ చేసి..ఇప్పుడు కాంగ్రెస్ మీదపడి ఏడుస్తున్నారని ఇంతకాలం బిఆర్ఎస్ ను విమర్శించి, మనం కూడా అదే ఊబిలో దిగితే కాంగ్రెస్ పార్టీని కూడా ప్రజలు నమ్మరు. ఇంతకాలం బిఆర్ఎస్ పదేళ్ల పాపాల గురించి మాట్లాడారు. ఇప్పుడిక కాంగ్రెస్ అవినీతి గురించి చర్చ మొదలయితే ఆ పార్టీని కాపాడడం కష్టమే. ఎందుకంటే మంత్రులపై సిఎం రేవంత్‌కు పట్టు లేదన్న విమర్శలు వస్తున్నాయి. నిప్పులేనిదే పొగరాదు. బిజెపి చేసిన ఆరోపణలను రేపు బిఆర్ఎస్ చేస్తుంది. అలాగని కాంగ్రెస్ మడిగట్టుకుని కూర్చున్న పార్టీ కాదు. అవినీతిలో ఆరితేరిన చేయి దానిది. ఇంతకాలం తమ పాలనలో అవినీతి వ్యవహారాల గురించి సమాధానం చెప్పడం లేదని ప్రజలు బిఆర్ఎస్‌ను నిందిస్తున్నారు. వారి పాలనలో మల్లన్నసాగర్ రైతులు తిరగబడితే ఎందుకు కేసులు పెట్టారో చెప్పాలని, ఖమ్మం జిల్లాలో రైతులపై ఎందుకు కాల్పులు జరిపారో..ఎందుకు బేడీలు వేశారో చెప్పారని అడుగుతూ వచ్చారు. కాళేశ్వరం అవినీతిపైనా మాట్లాడారు. వికారాబాద్ జిల్లాలో రైతులను రెచ్చగొట్టిన ఘటనకు సమాధానం చెప్పాలని అన్నారు నిజానికి ఫార్మా కంపెనీల సృష్ట ప్రదాత కెటిఆర్. దానిని ఎవరూ కాదనలేరు. రైతుల భూములను అడ్డంగా లాక్కుని వ్యాపారం చేయడం ఎవరు చేసినా నిలదీయాల్సిందే. కానీ బిఆర్ఎస్ కాదు. అది ప్రజలకు వదిలేయాలి. అవినీతి నేతలు నీతులు వల్లించడం సరికాదు. ఎందుకంటే బిఆర్ఎస్ గురించి చెప్పుకుంటూ పోతే కోకొల్లలుగా అవినీతి కథలు ఉన్నాయి. కానీ ఎదురుదాడి చేయడం, గగ్గోలు పెట్టడం ద్వారా ఎంతోకాలం నమ్మించలేరు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి జరిగిందని అంటున్నారు. నిజంగానే అవినీతి జరిగితే బయటకు లాగాల్సిందే. రేవంత్ అయినా, రాహుల్ అయినా అవినీతి వ్యయహారంఆలపై చర్చ చేయాల్సిందే. కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదస్ మున్సీ కూడా వాటాల కోసం డిమాండ్ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఇప్పటి వరకు ఇవన్నీ ఆరోపణలే కావచ్చు. కానీ నిజం బయటపడితే భగ్గున మండుతుంది. అవినీతిపై చర్చలో బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి నేతలు ఎవరున్నా వదిలిపెట్టకుండా రచ్చబండ ఏర్పాటు చేస్తే మంచిది. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, ఆ తర్వాత పార్టీలోని కొందరు కీలక నేతలు కారు దిగి కాంగ్రెస్‌లో చేరడం వంటి పరిణామాలతో సహజంగానే బిఆర్ఎస్ పార్టీలో కొంత నీరసం ఆవహించింది. ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు గెల్చుకోక పోవడం కూడా గులాబీ పార్టీకి రాజకీయంగా భారీ దెబ్బ పడింది. మరోవైపు లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవిత అరెస్టు కావడం కూడా ఆ పార్టీని దెబ్బతీసింది. ప్రతిపక్ష నేతగా చురుకుగా ఉండాల్సిన కెసిఆర్ ఇంటికే పరిమితం కావడం చూస్తున్నాం. అధికారం లేకుంటే అసెంబ్లీలో అడుగు పెట్టమన్న రీతిలో కెసిఆర్, జగన్ తీరు ఉంది. ఈ క్రమంలో తమపై అవినీతి కేసుల దాడి పెరగడంతో ఆత్మరక్షణ కోసం బిఆర్ఎస్ విన్యాసాలు చేస్తోంది. ఎదురుదాడిని ఎంచుకుంది. ఇప్పుడు కాంగ్రెస్‌పై వస్తున్న ఆరోపణల్లో నిజం ఉన్నా లేకున్నా రచ్చ చేసేందుకు బిజెపికి తోడు బిఆర్ఎస్ కూడా ముందుకు రావడం ఖాయం. ఇప్పటికే కాంగ్రెస్ పాలనా వైఫల్యాల ఆధారంగా కెటిఆర్ గత కొద్ది రోజులుగా దూకుడుగా వ్యవహరిస్తున్నారు. కేటీఆర్, హరీశ్ రావులు ఇద్దరూ అధికార కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. అంశాలవారీగా కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేల చేరిక విషయంలో న్యాయస్థానంలో సవాల్ విసిరారు. బిసి కులగణన,రైతుల రుణ మాఫీ, హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రక్షాళన వంటి అంశాలపై గగ్గోలు చేస్తున్నారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో విదేశీ కంపెనీకి అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రూ.55 కోట్లు నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారని, ఈ కేసులో ఏసీబీ విచారణ చేస్తోంది. దీనిపైనా పెద్దగా ప్రభావం కనిపించడం లేదు. ఇలా తెలంగాణలో రాజకీయ వాతావరణం వేడెక్కిన సమయంలో కాంగ్రెస్ అవినీతి వ్యవహారం అంటూ బిజెపి నేతలు విమర్శలు చేయడం సంచలనానికి దారి తీసింది. బిజెపితో బిఆర్ఎస్‌కు లోపాయకారి ఒప్పందం ఉందని ఆరోపించినంత మాత్రాన ఆరోపణల తీవ్రతను తగ్గించలేం. ఈ క్రమంలో తెలంగాణలో తమపై వస్తున్న ఆరోపణల దృష్ట్యా మంత్రులు జాగ్రత్తగా ఉండాలి. ప్రజా సమసయలపై శ్రద్ద పెట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా మంత్రి కేటీఆర్ ఇప్పటికే అమృత్ టెండర్ల వ్యవహారన్ని తెరపైకి తెచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి అమృత్ పథకంలో స్కాంకు తెరలేపారని ఆరోపించారు. అంతే కాకుండా రెవెన్యూ మంత్రి పొంగులేటికి సంబంధించిన స్కాంలను బయటపెడతానని కెటిఆర్ గతంలోనే హెచ్చరించారు. తప్పులేదు. రేవంత్, పొంగులేటిలు తప్పు చేసివుంటే కోర్టుకీడ్చాల్సిందే. అందుకే అందిరి అవినీతిపైనా చర్చ జరగాలి. విచారణ జరగాలి. కేసులు వేయాలి. అందుకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటు మాత్రమే పరిష్కారం చూపగలవు. అందుకు రాజకీయ నేతలు సిద్దమా కాదా అన్నది చెప్పాలి.

# అమెరికా ఫస్ట్ విధానంతో ..పట్టు బిగించే యత్నం

**వాషింగ్టన్:**రెండోసారి ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాక ప్రపంచం మీద అమెరికా ఆధిపత్యం సాధించాలన్న పట్టుదల కనిపిస్తోంది. అక్రమ వలసదారులను నిర్దాక్షిణ్యంగా ఏరిపారేయడం, సుంకాలు పెంచడం, వివిధ దేశాల్లో జోక్యం చేసుకోవడం వంటివన్నీ ఆయన దూకుడు వ్యవహారాన్ని కనబరుస్తున్నారు. వీసా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని చూస్తున్నాడు. తమగడ్డపై పిల్లను కంటే అమెరికా పౌరసత్వం రాకుండా ఆదేశాలు ఇచ్చారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక రకాలుగా నిర్ణయాలు తీసుకుంటున్నాడు. మాటల్లో, చేతల్లో తన లక్ష్యం ఆధిపత్యం అన్నది స్పష్టంగా కనిపిస్తున్నది. ఎక్కడా కూడా అయన రాజీ ధోరణి వ్యక్తం చేయడం లేదు. సుంకాల తగ్గింపు కుదరదని మోడీకి మొహం మీదే చెప్పేశాడు. తన దేశ హితమే ముందు అన్న విధంగా అమెరికా ఫస్ట్ సిద్ధాంతాన్ని ప్రకటించుకున్నాడు.

అమెరికా ఆర్థిక వ్యవస్థను మరింతగా బలోపేతం చేసేందుకు వాణిజ్యం మీద దృష్టి సారించినట్లుగా కనిపిస్తున్నది. ప్రధానంగా సుంకాల మీద దృష్టి కేంద్రీకరించాడు. ఒకవైపు ఉక్రెయిన్, రష్యా యుద్ధం ఆపాలని కోరుతూనే, గాజాపై కబ్జాకు ఉపక్రమించే పరిస్థితి చూస్తున్నాం. దశాబ్దాలుగా భారతదేశంలో ఇతర దేశాల జోక్యం అంగీకరించని ఇండియాకు చైనాతో ఉన్న వివాదం పరిష్కరిస్తామని కూడా పేర్కొన్నాడు. గతంలో ఒబామా కాలంలో ఇదే విషయం ప్రస్తావనకు వస్తే, అప్పటి పీఎం మన్మోహన్ సింగ్ సున్నితంగా తిరస్కరించారు. ఏ దేశంతోనైనా నేరుగా చర్చించి తన సమస్యను తాను పరిష్కరించుకునే సత్తా ఇండియాకు ఉందని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'గాజా' మీద ఇజ్రాయెల్ యుద్ధాన్ని అక్కడి ప్రధాని నెతన్యాహును ఒప్పించి ఆపించానని చెప్పాడు. షరతుల ప్రకారం హమాస్ వద్ద, అటు ఇజ్రాయెల్ వద్ద ఉన్న ఇరుపక్షాల ఖైదీలను విడతలవారీగా విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గాజా మీద యాజమాన్య హక్కు తనకు ఉంటుందని అక్కడ సముద్రపు ఒడ్డున రిసార్టులు, ఇతర ఏర్పాట్లు చేస్తామని, అందుకు గాజాను ఖాళీ చేయాలని ట్రంప్ తెలిపాడు. ట్రంప్ ప్రకటన నెతన్యాహుకు ఆమోదమే. ఎందుకంటే గాజా నుంచి జనాన్ని ఖాళీ చేయించడమే ఆయన లక్ష్యం. ఇక్కడ వీరిద్దరి ఉద్దేశం ఒక్కటే అని తేలిపోయింది. క్రమంలో హమాస్ తమ వద్ద ఉన్న, అఖరి ఆయుధమైన ఖైదీల విడుదల విషయంలో కొంత ఆలస్యం చేయడమేకాక యుద్ధం, దాడులు మళ్ళీ గాజా ఖాళీ చేయించే విషయంలో నెతన్యాహు, ట్రంప్ కలిసి దాడి చేసే అవకాశం ఉందని అప్రమత్తం అవుతున్నట్టు కనిపిస్తోంది. మరోవైపు తాము గాజా విడిచి ఎటు పోతామని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరి 15న హమాస్ నిర్బంధంలో ఉన్న ఇజ్రాయెల్ ఖైదీలను విడుదల చేయాలని ట్రంప్ వార్నింగ్ జారీ చేశాడు. దీంతో మళ్ళీ గాజా మీద దాడి తప్పదా అనే పరిస్థితి నెలకొన్నది.కొన్నిచోట్ల దాడులు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే గాజాలో పాలస్తీనీయులు వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. 92 శాతం గృహాలు, 70 శాతం పెద్ద భవనాలు, ఆసుపత్రులు నేలమట్టం అయ్యాయి. నిరాశ్రయులు ఉండడానికి షెల్టర్ లేదు. గాజా పునర్‌నిర్మాణానికి పదిహేను ఏండ్లకు పైగా పడుతుంది. అయితే, యుద్ధం, బాంబుల వల్ల భూమి పనికి రాకుండా అయ్యిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో గాజాను కబ్జా చేసే పనిలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉన్నాడు. అయితే, తాజాగా ట్రంప్ మాటలను చైనా ఖండిస్తూ ముమ్మాటికీ గాజా పాలస్తీనా ప్రజలదే అని పేర్కొంది. ట్రంప్ ఆలోచన ప్రపంచ దేశాలలోని మెజారిటీ ప్రజలు విమర్శిస్తున్నారు. మొత్తానికి ట్రంప్ వ్యవహారం ప్రపంచంపైన ఆధిపత్యం సాధించే దిశగా కొనసాగుతోంది. వాణిజ్యంలోనూ అమెరికా నవంబర్ వన్?గా రాణించాలని తహతహలాడుతు న్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో బ్రిక్స్ దేశాలు ఏం చేస్తాయో వేచిచూడాలి.

# సర్వే ప్రక్రియ పారదర్శకంగా లోపాలు లేని భూ రికార్డులు తయారయ్యే విధంగా అధికారులు చేపట్టాలి:

**కేంద్ర ప్రభుత్వం ద్వారా నక్ష (NAKSHA) కార్యక్రమం కింద తిరుపతి పట్టణం ఎంపిక కాబడిన నేపథ్యంలో సర్వే ప్రక్రియ పారదర్శకంగా లోపాలు లేని భూ రికార్డులు తయారయ్యే విధంగా అధికారులు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్**



**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,ఫిబ్రవరి18:**

కేంద్ర ప్రభుత్వం ద్వారా నక్ష కార్యక్రమం కింద తిరుపతి పట్టణం ఎంపిక కాబడిన నేపథ్యంలో పట్టణంలో సర్వే ప్రక్రియ ద్వారా పారదర్శకంగా లోపాలు లేని భూ రికార్డులు తయారయ్యే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ పేర్కొన్నారు.మంగళవారం ఉదయం స్థానిక కచ్చపి ఆడిటోరియం నందు కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం నక్ష సర్వే పై వర్క్ షాప్ ను జిల్లా కలెక్టర్ గారు, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి మున్సిపల్ కమిషనర్ శ్రీమతి మౌర్య, డిప్యూటీ మేయర్ లు ముద్ర నారాయణ, ఆర్ సి మునికృష్ణ, కార్పొరేటర్ అనిత తదితరులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ " నక్షా (NAKSHA) " భారత ప్రభుత్వ మార్గ నిర్దేశాల మేరకు చేపట్టడం జరుగుతుందని ఈ సర్వే ద్వారా తిరుపతి పట్టణంలోని పలు భూ సంబంధిత రికార్డులు పూర్తిస్థాయిలో పక్కాగ లోపాలు లేనివిగా తయారవ్వాలని సూచించారు. దేశంలోని 150 సిటీ లను కేంద్ర ప్రభుత్వం గుర్తించి వీటిలో నక్ష అనే ప్రోగ్రాం కింద సర్వే చేపట్టడం జరుగుతుందని అన్నారు. అందులో మన తిరుపతి పట్టణం ఎంపిక కావడం సంతోషం అని అన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా తిరుపతి జిల్లాలో పలు భూ సంబంధిత సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. రీ సర్వేలో చేపట్టిన విధంగానే డ్రోన్ ఫ్లై, ఓ ఆర్ ఐ ఇమేజెస్ తీయడం, గ్రౌండ్ ట్రూథింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ తదితర ప్రక్రియలు ఉంటాయని తెలిపారు. సదరు నక్ష కార్యక్రమం ద్వారా తిరుపతి పట్టణంలో అధికారులు సర్వే నిర్వహణ చేస్తున్న విషయం సంబంధిత భూమి, ఆస్తి యజమానికి తెలియజేసి ఎలాంటి అపోహలు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. రికార్డులు సక్రమంగా లేకపోవడం వలన ఒకే భూమిపై పలు రిజిస్ట్రేషన్లు, రికార్డులు తయారవుతున్నాయని భూ సమస్యలకు ఈ నక్ష కార్యక్రమం మంచి పరిష్కారం అవుతుందని తెలిపారు.తద్వారా భూతగాదాలు తగ్గిపోతాయని తెలిపారు. జిఐఎస్ టెక్నాలజీతో పారదర్శకమైన యాజమాన్య హక్కు రికార్డులు, పట్టణంలో పలు సదుపాయాల కల్పన ప్రణాళికల కొరకు ఈ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఎంతో కచ్చితత్వంతో కూడిన నిర్ణయాలు, ప్రణాళికలు, ల్యాండ్ బ్యాంక్ అందుబాటు ఉన్న వాటిని సక్రమంగా వినియోగించుటకు ఉపయోగపడుతుందని తెలిపారు. సంబంధిత వార్డు అడ్మినిస్ట్రేటర్ మరియు ఎమినిటీస్ సెక్రెటరీ సంబంధిత అధికారులు బాధ్యతగా సర్వే ప్రక్రియ బాధ్యతగా పక్కాగా చేపట్టాలని సూచించారు. తిరుపతి ఎంపీ మాట్లాడుతూ తగాదాలు లేని పక్కాగా ఉండే రికార్డులు తయారయ్యేలా నక్షా ప్రోగ్రాం మన భారత ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని, నిష్పక్ష పాతంగా సర్వే చేపట్టాలని అన్నారు. తిరుపతి నందు పలు భూ సంబంధిత సమస్యలు ఉన్నాయనీ, బయటి దేశాలలో మన జిల్లా వాస్తవ్యులు ఉన్నారని వారికి ఒక భరోసా, ఒక నమ్మకం కలగాలంటే సర్వే పక్కాగా నిష్పక్షపాతంగా చేపట్టాలి అని కోరారు. ఎమ్మెల్సీ సుబ్రమణ్యం మాట్లాడుతూ సమస్యలు భూ సంబంధితమైనవి ఎక్కువగా ఉంటున్నాయని, పేద వారు ఎక్కువగా వీటితో సతమతమవుతుంటారు అని, సదరు ట్రైనింగ్ బాగా వినియోగించుకుని పక్కాగా ల్యాండ్ రికార్డ్స్ తయారయ్యే లా చూడాలని కోరారు.తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య గారు మాట్లాడుతూ తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నక్షా (‘%NAKSHA% “ నేషనల్ జియో ఫేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్స్) సర్వే ప్రక్రియను భారత ప్రభుత్వ నిర్దేశాల మేరకు నిర్వహిస్తున్నామని అందులో డ్రోన్ సర్వే, గ్రౌండ్ ట్రూతింగ్, వెక్టరైజేషన్, వ్యాలిడేషన్ చేసి పక్కా భూ రికార్డులు నిర్వహణకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తిరుపతి పట్టణం డ్రోన్ సర్వే 30 చ. కిలోమీటర్లు సర్వే చేయడం జరుగుతుందని, డిజిటల్ అసిస్టెంట్స్, ఎమినిటీస్ సెక్రటరీ సంబంధిత అధికారులు జాగ్రత్తగా చేపట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గ్రౌండ్ ట్ర్యూథింగ్, జిఐఎస్ మ్యాపింగ్ పక్కాగా ఉండాలని సూచించారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రాపర్టీ టాక్స్ అసెస్మెంట్, పర్మిషన్ ఉందా లేదా అని పర్యవేక్షణ చేయడానికి ఉపయోగకరంగా ఉంటుంది అని అన్నారు. అనంతరం నక్ష (%NAKSH A%) పోస్టర్ ను కలిసి ఆవిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో తిరుపతి మున్సిపాలిటీ అదనపు కమిషనర్ చరణ్ తేజ్, ఉప కమిషనర్ అమరయ్య, సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ సర్వేయర్ దేబ బ్రత పాలిత్, జిల్లా భూ రికార్డుల అధికారి అరుణ్ కుమార్, డిసిపి మాహా పాత్ర, తహశీల్దార్ అర్బన్ భాగ్యలక్ష్మి, వార్డు ఎమినీటీస్ , అడ్మిన్, ప్లానింగ్ సెక్రెటరీలు, వి.ఆర్.ఓ.లు, తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణలో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి : మున్సిపల్ కమిషనర్ ఎస్ బేబీ

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఫిబ్రవరి 18 :**



నందికొట్కూరు పట్టణంలో లీకేజీ మరమ్మతుల పనుల నిర్వహణలో భాగంగా మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎస్ బేబీ కేజీ రోడ్లన్నీ చౌడేశ్వరి టెంపుల్ ఎదుట పైప్ లైన్ లీకేజీ పనులను స్వయంగా దగ్గరుండి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ నందికొట్కూరు పట్టణంలో నీటి సమస్య లేవనెత్తకుండా ముందస్తు ప్రణాళిక ఏర్పాటు లో పైపులను లీకేజ్ మరమ్మతులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది అన్నారు. పట్టణంలోని అన్ని కాలనీల ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడకుండా చేపట్టడం మా బాధ్యత అని అన్నారు.

ఏది ఏమైనా పట్టణంలో ఎవరికైనా తాగునీటి సమస్య ఉంటే వెంటనే మున్సిపల్ సిబ్బందిని సంప్రదిస్తే తాగునీటి సమస్య పరిష్కరించేందుకు మున్సిపల్ సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ నాజీర్, ఏఈ దినేష్ కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులు ప్రారంభం.... సుభాన్.

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు**





ఫిబ్రవరి 18: రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానంలో నూతన విద్యాపాలసిలో భాగంగా అంగన్వాడి కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో మంగళవారం నుండి స్థానిక పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి ఎస్ సుభాన్ తెలిపారు. ఈ శిక్షణ తరగతులు అంగన్వాడి కార్యకర్తలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన తెలిపారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 40 మందికి , బాలుర ఉన్నత పాఠశాలలో 32 మందికి జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో 15 రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. అంగన్వాడి కేంద్రాలకు వస్తున్న చిన్నపిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పించడంపై జ్ఞాన జ్యోతిలో అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్య శాఖ అధికారులతో పాటు ఐసిడిఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# విధులలో నిర్లక్ష్యం తగదు ఎమ్మెల్యే గిత్త జయసూర్య







**ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించండి**

**ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గిత్త జయ సూర్య**

**సర్వసభ సమావేశం మండల అధ్యక్షులు మురళి కృష్ణారెడ్డి అధ్యక్షతన**

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఫిబ్రవరి 18:**

నందికొట్కూరు మండల పరిధిలోని ప్రతి ప్రభుత్వ విధుల్లో నిర్లక్ష్యం తగదు ఏది ఏమైనా ప్రజల వద్దకు సమస్యలు తప్పకుండా పరిష్కరించి ప్రజాభివృద్ధికి పాటుపడాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య మంగళవారం జరిగిన సర్వసభ సమావేశంలో అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షులు మురళీ కృష్ణారెడ్డి అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య ప్రతిష్టాత్మకంగా ప్రజాసంక్షేమానికి ఎనలేని సేవ చేసి లెక్కలేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మచ్చలేని మహనీయులుగా పేరుగాంచిన నేత జయంతిని రాష్ట్రవ్యాప్తంగా పండగ జరుపుకోవాలని అధికారులను ఆదేశించినప్పటికీ హాజరు కాకపోవడం ఎంతవరకు సమంజసం సంబంధిత అధికారులపై ఆగ్రహం చెందారు. ముఖ్యంగా నందికొట్కూరు మండల పరిధిలో వేసవిని దృశ్యలో పెట్టుకొని ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేదలకు ఇల్లు పథకం లో పొజిషన్ సర్టిఫికెట్ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇవ్వాలని ఆయన తాసిల్దార్ కు సూచించారు. హౌసింగ్ అధికారులు ఆరాధన ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మాణ కార్యక్రమం చేపట్టేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. వచ్చి సర్వసభ సమావేశానికి అన్ని శాఖల అధికారులు ఒక రోజు ముందుగానే స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తమ శాఖ ప్రగతి నివేదికలను సమర్పించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్వాడి సెంటర్లలో నీ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో కచ్చితంగా చేర్పించే విధంగా చర్య లు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో స్థానిక ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ,, తహసిల్దార్ శ్రీనివాసులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించండి

**బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి :**



అంగన్వాడి కార్యకర్తలు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులతో సమనయంతో ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి సహకరించాలని ఎంపీడీవో ఫజల్ రహిమాన్,నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ ,అన్నారు.మంగళవారం బేతంచర్ల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు7రోజుల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవోలు సోమశేఖర్, అబ్రహం ,లఆధ్వర్య ములో నిర్వహించారు.డిఆర్పీలు నాగ రాజు ,సోమన్న,వెంకటేష్ నాయక్,రేణుక, లతో అన్ని గ్రామాల అంగవాడి కార్యకర్తలకు ప్రాథమిక విద్యపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు భూసేకరణ, నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్



**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,ఫిబ్రవరి 18**

: జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలోజాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్ట్ పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు,నిర్మాణ పురోగతి పనులపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ వర్చువల్ విధానంలో నేషనల్ హైవే పి డి లు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ఆర్డీఓలు, కిరణ్మయి, భానుప్రకాష్ రెడ్డి సంబంధిత మండలాల తాసిల్దార్లు తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, రైల్వే ప్రాజెక్ట్స్ పనులు పురోగతిలో ఉన్న కడప %-% రేణిగుంట , తిరుపతి %-% మదనపల్లి , రేణిగుంట %-% నాయుడుపేట ఆరు లైన్ల రహదారులు నిర్మాణం, తిరుపతి బైపాస్ వేగవంతం చేయాలని, రేణిగుంట నుండి చెన్నై వరకు 4 లేన్ల రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల నిసూచించారు .భూసేకరణ పెండింగ్ అవార్డులు పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని తెలిపారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని పనులు పూర్తి కావాలని అన్నారు. రైల్వే లైన్ లో భాగంగా భూ సేకరణకు సంబంధించిన పనులును సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే తిరుపతి రేణిగుంట బైపాస్ సంబంధించిన పెండింగ్ భూ సమస్యలను పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ లను ఆదేశించారు.ఈ సమావేశంలో ఏపీఐఐసీ జెడ్ ఎం విజమ్ భరత్ రెడ్డి, నేషనల్ హైవే పి డి లు తిరుపతి వెంకటేష్,నెల్లూరు ఎంకే చౌదరి, చెన్నై రవీంద్రరావు, డెప్యూటీ తాసిల్దార్ భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, ఫిబ్రవరి 18**

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 26 నుండి మార్చి 6వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ.ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఉదయం 7 నుండి 11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో శ్రీ రమేష్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు :తేదీ ఉదయం సాయంత్రం

26-02-2025 ధ్వజారోహణం(మేష లగ్నం) పెద్దశేష వాహనం27-02-2025 చిన్నశేష వాహనం హంస వాహనం28-02-2025 సింహ వాహనం ముత్యపుపందిరి వాహనం01-03-2025 కల్పవృక్ష వాహనం సర్వభూపాల వాహనం02-03-2025 పల్లకీ ఉత్సవం(మోహినీ అవతారం) గరుడ వాహనం03-03-2025 హనుమంత వాహనం గజ వాహనం04-03-2025 సూర్యప్రభ వాహనం చంద్రప్రభ వాహనం05 -03-2025 రథోత్సవం అశ్వవాహనం06-03-2025 చక్రస్నానం ధ్వజావరోహణం ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తారు. మార్చి 7న మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటల వరకు పుష్పయాగం జరుగనుంది.

# ప్రెగ్నెంట్స్ తినొచ్చా..



ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పుడు ఎంత జాగ్రత్తగా ఉంటే మంచిది. మరీ ముఖ్యంగా ఫుడ్ విషయంలో ఈ నేపథ్యంలో బొప్పాయి తినొచ్చా లేదా అనే అనుమానం ఉంటుంది. దీని గురించి పూర్తి వివరాలు తెలుసుకోండి. ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పుడు కొన్ని ఫుడ్స్ తినకపోవడమే మంచిది. అందులో బొప్పాయి ఒకటి. బొప్పాయి తింటే అబార్షన్ అవుతుందని చాలా మంది చెబుతారు. దీని గురించి కొండట్టి, మలబార్ మెడికల్ సెంటర్ డా. సఫియా మూసా తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో ఈ విషయాన్ని పంచుకున్నారు. పండిన బొప్పాయి.. పండిన బొప్పాయి గర్భిణీలకు చాలా మంచిది. ఇందులో విటమిన్ ఎ, బి,సిలు పుష్కలంగా ఉన్నాయి. అందువల్ల, గర్భిణీలకు మంచిదని సఫియా మూసా చెప్పింది. ప్రెగ్నెంట్స్ చాలా మంది మలబద్ధకంతో బాధపడతారు. బొప్పాయి తింటే ఆ సమస్య తగ్గిపోతుంది. పండిన బొప్పాయి తింటే మంచిదే. కానీ, పచ్చి బొప్పాయి తినొద్దు. పచ్చి బొప్పాయిలో పపైన్ ఉంటుంది. ఇది ఊబకాయానికి కారణమవుతుంది. అందుకే దీనిని అస్సలు తినొద్దు..







పండిన బొప్పాయితో లాభాలు.. పండిన బొప్పాయిలో విటమిన్స్ ఎ, బి, సి అలాగే పొటాషియం, బీటా కెరోటిన్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇది గర్భిణీల ఆరోగ్యానికే కాదు.. వారికి పుట్టబోయే పిల్లల నరాల ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. గర్భధారణ సమయంలో మంచి ఇమ్యూనిటీని పెంచి అనేక సమస్యల నుంచి కాపాడతాయి. ఈ పండుని తినడం వల్ల జీర్ణక్రియ మెరుగ్గా ఉంటుంది. ఉదయాన్నే అలసటగా ఉన్నవారు బొప్పాయి తినడం మంచిది. దీని వల్ల ప్లేట్‌లెట్ కౌంట్ పెరుగుతుంది. అయితే, బొప్పాయి డాక్టర్ సలహాతో తీసుకుంటే తల్లిపాలు పెరుగుతాయి.

ఎలాంటి వాటిని ఎంచుకోవాలి.. మంచిగా పండిన పండుని ఎంచుకోవాలి. ఇది ఆరెంజ్ కలర్‌లో ఉంటుంది. పాడైపోయిన బొప్పాయి తినకపోవడం మంచిది. అయితే, తినే ముందు కచ్చితంగా డాక్టర్‌ని అడిగి తినాలి. అతిగా తీసుకోకూడదు. ఈ పండు తిన్నప్పుడు మీకు అసౌకర్యం, అజీర్ణం లేదా రక్తస్రావం అనిపిస్తే డాక్టర్‌ని సంప్రదించాలి.

# పేషెంట్స్.. సీతాఫలం తినొచ్చా..?





షుగర్ సీతాఫలం మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని మనకు తెలుసు. అయితే, కొంతమందికి సీతాఫలం తినడానికి కొన్ని సందేహాలు ఉంటాయి. మార్కెట్లో సీతాఫలాలు సందడి చేస్తున్నాయి. అమృతంలా ఉండే ఈ పండును ఇష్టపడనివారుండరు. చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు.. ఎంజాయ్ చేస్తూ తింటూ ఉంటారు. దీని రుచిలోనే కాదు.. పోషకాలూ అద్భుతంగా ఉంటాయి. దీనిలో సి-విటమిన్‌తోపాటు ఎ, బి, కె విటమిన్లు, ప్రొటీన్లు, కాల్షియం, ఫాస్ఫరస్, మెగ్నీషియం, పొటాషియం, ఐరన్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.

సీతాఫలం తింటే..రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. ఇది శరీరానికి చలువ చేయడంతో పాటు రక్తహీనత సమస్య నుంచి రక్షిస్తుంది. ఇందులో ఉండే కాపర్ మనం తీసుకునే ఆహారం త్వరగా జీర్ణమవడంలో సహాయపడుతుంది. అయితే కొంతమంది.. దీని తినడానికి సందేహిస్తూ ఉంటారు. సీతాఫలం గురించి వారికి ఎన్నో అనుమానాలు ఉంటుంటాయి.

బరువు పెరుగుతారా..? సీతాఫలం తింటే.. బరువు పెరుగుతారనే సందేహం చాలామందికి ఉంటుంది. అయితే, ఇది అపోహ మాత్రమే అని నిపుణులు అంటున్నారు. సీతాఫలంలో కొవ్వులు, క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. దీనిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది కడుపు నిండిన భావన కలిగేలా చేస్తుంది. తద్వారా ఎక్కువ సమయం ఆహారం తీసుకోకుండా ఉండి క్రమంగా బరువు తగ్గచ్చు. సీతాఫలంలో ఉండే విటమిన్ బి6 కడుపుబ్బరం, అజీర్తి, అల్సర్లు.. వంటి సమస్యల నుంచి విముక్తి కలిగిస్తుంది.

పీసీఓఎస్ ఉంటే తినొచ్చా..? పీసీఓఎస్ ఉన్న వారిలో హార్మోన్ల అసమతుల్యత కారణంగా అలసట, నీరసం, మూడ్ స్వింగ్స్, చికాకు.. వంటివి సమస్యలు ఎదురవుతాయి. సీతాఫలంలో ఐరన్ అధికంగా ఉంటుంది. ఐరన్ ఈ సమస్యలను దూరం చేస్తుంది. పీసీఓఎస్ ఉన్నవారు సీతాఫలం తింటే.. మంచిదని నిపుణులు అంటున్నారు. ఈ పండులోని ఫైబర్ - గర్భిణుల్లో మలబద్ధకాన్ని తగ్గించడంతో పాటు, యాంటీ ఆక్సిడెంట్లు - వికారం, వాంతులు.. వంటి సమస్యలకు చెక్ పెడుతుంది.



గుండె సమస్యలు ఉంటే మంచిది కాదా..? శరీరంలో మెగ్నీషియం లోపిస్తే గుండెపై ప్రతికూల ప్రభావం పడుతుంది. కాబట్టి మెగ్నీషియం నిండి ఉన్న సీతాఫలం ఆ సమస్యను నివారిస్తుంది. ఇక ఇందులో ఉండే ఇతర ఖనిజాలు, విటమిన్ 'సి' రక్తప్రసరణ వ్యవస్థను మెరుగుపరిచి గుండె ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. షుగర్ ఉంటే తినకూడదా..? సీతాఫలం చాలా మధురంగా ఉంటుంది. దీంతో, షుగర్ పేషెంట్స్ సీతాఫలం తినడానికి సందేహిస్తూ ఉంటారు. అయితే, సీతా ఫలంలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. కాబట్టి మధుమేహ ఉన్న వారు ఎలాంటి భయం లేకుండా సీతా ఫలాన్ని తినవచ్చు. అయితే, మితంగానే తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

# రాత్రిపూట ఆలస్యంగా నిద్రపోతున్నారా..?










అయితే ఈ అనారోగ్యాల ముప్పు తప్పదు జాగ్రత్త..! రాత్రి త్వరగా నిద్రపోయి, తెల్లవారుజామునే నిద్రలేవాలని పెద్దలు అంటూ ఉంటారు. అయితే, మనలో చాలామంది దీనికి రివర్స్ ఫాలో అవుతూ ఉంటారు. ఈ డిజిటల్ యుగంలో.. యువత, కాలేజీ స్టూడెంట్స్ అర్ధరాత్రి వరకు ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ముందేసుకుని కూర్చుంటున్నారు. కొందరు పనిలో పడి.. రాత్రి 12 దాటినా మెలకువగానే ఉంటున్నారు. రాత్రి బాగా పొద్దుపోయాక నిద్ర పోవడం, ఆలస్యంగా లేవడం వల్ల మన 'జీవ గడియారంలో ఎన్నో మార్పులు జరుగుతాయని నిపుణులు అంటున్నారు. దీంతో శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరిస్తున్నారు. బ్రిటన్‌లోని నార్త్ వెస్ట్రన్, సర్రే యూనివర్సిటీలు ఇటీవల జరిపిన పరిశీలన ప్రకారం.. రాత్రిపూట ఆలస్యంగా నిద్రపోయేవారిలో డయాబెటిస్, మానసిక సమస్యలు, నాడీ సంబంధ సమస్యలు, ఉదర కోశ, గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతాయని వెల్లడైంది.

ఆయుర్దాయం తగ్గిపోతుంది.. లాన్సెంట్ ఆరోగ్య అధ్యయనంలో భాగంగా దక్షిణ కొరియాలోని 3757 మందిని ఒక బృందం పరిశీలించింది. 16.7 సంవత్సరాల పరిశోధన తర్వాత, 40 నుంచి 69 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తులు నిద్రపోవడానికి ఎక్కువ సమయం తీసుకునేవారి ఆయుర్దాయం తగ్గే ప్రమాదం ఉందని గుర్తించారు. మనం ఆరోగ్యంగా ఉండటానికి నిద్ర చాలా ముఖ్యమైన అధ్యయనం స్పష్టం చేసింది.

అభిజ్ఞా పనితీరు దెబ్బతింటుంది.. రాత్రిపూట ఆలస్యంగా నిద్రపోవడం వల్ల.. జ్ఞాపకశక్తి, నిర్ణయం తీసుకోవడం, సమస్య-పరిష్కారం వంటి అభిజ్ఞా విధులు దెబ్బతింటాయి. ఇది ఏకాగ్రత, ఉత్పాదకతపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. శారీరక, మానసిక శ్రేయస్సు కోసం నిద్ర చాలా అవసరం. దీర్ఘకాలిక నిద్రలేమి అభిజ్ఞా పనితీరు, మానసరిక స్థితి, మొత్తం ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. బరువు పెరుగుతారు.. నిద్రవిధారం క్రమరహితంగా ఉంటే.. హార్మోన్ల సమతుల్యతపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా ఆకలి, జీవక్రియలను నియంత్రిస్తాయి. రాత్రిపూట ఆలస్యంగా నిద్రపోయేవారికి.. ఊబకాయం, అధిక బరువు ముప్పు పెరుగుతుంది. నిద్ర అస్థిరంగా ఉన్నప్పుడు, లెప్టిన్, గ్రెలిన్ వంటి ఆకలి, సంపూర్ణతను సూచించే హార్మోన్లు అసమతుల్యత చెందుతా యి. దీనివల్ల ఆహారం ఎక్కువగా తింటూ ఉంటారు. కేలరీలను సమర్థవంతంగా బర్న్ చేసే సామర్థ్యాన్ని తగ్గించవచ్చు. తద్వారా బరువు పెరుగుతారు.



రోగనిరోధక వ్యవస్థ బలహీనపడుతుంది.. దీర్ఘకాలిక నిద్ర లేమి రోగనిరోధక వ్యవస్థపై హానికరమైన ప్రభావాలను కలిగిస్తుంది. శరీరానికి స్థిరంగా తగినంత విశ్రాంతి లేనప్పుడు, అనారోగ్యాలు, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించే దాని సామర్థ్యం రాజీపడు తుంది. అవసరమైన రోగనిరోధక కణాలు, ప్రతిరోధకాలను ఉత్పత్తి చేసే రోగనిరోధక వ్యవస్థ సామర్థ్యం తగ్గిపోతుంది. షుగర్ పెరుగుతుంది.. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం, రోజూ 7 గంటల కంటే తక్కువ నిద్రపోవడం మధుమేహం నిర్వహణను గణనీయంగా క్లిష్టతరం చేస్తుంది. నిద్రలేమి ఇన్సులిన్ నిరోధకతను పెంచుతుంది, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం శరీరానికి మరింత సవాలుగా మారుతుంది. రాత్రిపూట ఆలస్యంగా నిద్రపోతే.. హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఈ కారకాలు డయాబెటిస్ ఉన్న వ్యక్తుల్లో బ్లడ షుగర్ లెవల్స్‌ను తగ్గించడం కష్టం అవుతుంది.

# జుట్టు ఎందుకు రాలుతుంది?






జుట్టు రాలడం నేడు చాలా కామన్ ప్రాబ్లమ్. దీనికి ఎన్నో కారణాలు ఉన్నాయి. అలాంటి కారణాలు ఏంటి? ఏం చేస్తే సమస్య జుట్టు రాలడం తగ్గుతుందో తెలుసుకోండి. చిన్న పిల్లలు మొదలు పెద్దల వరకూ జుట్టు రాడం అనేది చాలా కామన్ ప్రాబ్లమ్. దీనిని తగ్గించాలంటే ముందుగా నూనె రాయాలని చాలా కాన్ఫిడెంట్‌గా ఉంటారు కానీ, అది ఒక్కటే సొల్యూషన్ కాదు. నూనె రాస్తే జుట్టు తేమగా మారుతుంది. దీంతో పాటు పోషక లోపం వల్ల కూడా జుట్టు ఊడుతుంది. మన బాడీలోని పోషకలోపం మన జుట్టు ఆరోగ్యాన్ని ఎఫెక్ట్ చేస్తుంది. కాబట్టి, జుట్టు రాలడం సమస్య అయితే నూనె కొనే ముందు కొన్ని విషయాలు తెలుసుకోండి. జుట్టుకి నూనె రాయకపోవడం వల్లే సమస్య కాదు. దీనికి చాలా కారణాలు ఉన్నాయి. మనకి ఉన్న హెల్త్ ప్రాబ్లమ్స్ కూడా జుట్టు ఆరోగ్యాన్ని ఎఫెక్ట్ చేస్తాయి. పౌష్టికాహారం తీసుకోకపోతే జుట్టు ఆరోగ్యాన్ని నాశనం చేస్తుంది. కేవలం అన్నం తింటే సరిపోదు. శరీరానికి పోషకాలు అవసరం. ప్రోటీన్స్ తీసుకోవాలి. అదే విధంగా, కుటుంబం వారసత్వం జుట్టుపై ఎఫెక్ట్ వస్తుంది. బట్టతల వంశపారంపర్యంగా వచ్చే అవకాశం ఉంది. మీ ఇంట్లో ఎవరికైనా సమస్య ఉంటే ఈ సమస్య ఉంటుంది. బాడీలోని హార్మోన్ల మార్పులు జుట్టు రాలడానికి కూడా కారణాలు. థైరాయిడ్, అలోపేసి యా, ఆటో ఇమ్యూన్ సమస్యలు కూడా జుట్టు రాలడానికి కారణాలు. వీటితో పాటు.. ఒత్తిడి, నిద్రలేమి, ఏవైనా సమస్యలకి మందులు వాడడం, ఏదైనా ట్రీట్‌మెంట్ తీసుకోవడం, వృద్ధాప్యం, బరువు తగ్గడం, పొల్యూషన్ వంటి కారణాలు కూడా జుట్టు రాలడానికి కారణాలు.


ఐరన్ లానే ప్రోటీన్ ఫుడ్స్ తీసుకోవడం చాలా ముఖ్యం. మన జుట్టు కెరాటిన్ ప్రోటీన్‌తో తయారవుతుంది. అందువల్ల, మన శరీరంలో ప్రోటీన్ లేకపోవడం జుట్టు ఆరోగ్యాన్ని ఎఫెక్ట్ చేస్తుంది. ఇది జుట్టు పల్చబడడం, జుట్టు రాలడానికి కారణమవుతుంది. కాబట్టి, పుష్కలంగా ప్రోటీన్ ఫుడ్ తీసుకోండి. ఏం తినాలంటే..ముందుగా చెప్పినట్లు పోషకాల లోపం కారణంగా జుట్టు రాలుతుంది. దీనిని తగ్గించేందుకు ఐరన్ లోపమే కారణం. శరీరంలో హిమోగ్లోబిన్ మనకు మంచి మొత్తంలో ఐరన్ అవసరం. రక్తస్థాయిలు సరిగ్గా ఉన్నప్పుడే యాక్సిడెంట్స్ శరీర కణాలకు చేరుతాయి. వెంట్రుకలకి ఆక్సిజన్ సరిగ్గా అందినప్పుడే జుట్టు కుదుళ్ళు బలంగా అవుతాయి. కాబట్టి ఐరన్ ఫుడ్స్ తీసుకోవాలి.


పోషకాలు.. ప్రోటీన్, ఐరన్‌తో పాటు బయోటిన్ కూడా తీసుకోవాలి. దీనికోసం చాలా మంది బయోటిన్ గమ్మీస్ తీసుకుంటున్నారు. జుట్టు ఆరోగ్యంలో బయోటిన్ చిన్న పాత్రే పోషిస్తుంది. దీని లోపం పెద్దగా ఎఫెక్ట్ చూపించదు. అదే విధంగా, విటమిన్ డి లోపం, జింక్ లోపం, శరీరంలో విటమిన్ ఎ అధికంగా ఉండడం వల్ల జుట్టు రాలిపోతుంది. అదే విధంగా విటమిన్ ఇ లోపం, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ లోపం, విటమిన్ సి లోపం, అలాగే విటమిన్ బి3 లోపం వల్ల జుట్టు రాలిపోతుంది. కాబట్టి ఈ పోషకాలన్నీ శరీరంలో సరిగ్గా ఉండేలా చూడాలి. అయినా తగ్గకపోతే.. చుండ్రు కారణంగా జుట్టు రాలుతుంది. కాబట్టి, ఈ సమస్యని తగ్గించుకోవాలి. అయినా సమస్య తగ్గకపోతే ముందుగా డాక్టర్‌ని కలిసి సలహాలు, సూచనలు తీసుకోవాలి. వీటివల్ల సమస్య పరిష్కారమవుతుంది.





# ఇంట్లోనే లిప్‌బామ్.. ఇలా తయారుచేసుకోండి..!











చలికాలంలో పెదవులు పొడిబారడం సహజం. లే చలికాలం.. మనం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పెదవులు పొడిగా అయిపోవడం, పగలడం.. వంటివి జరుగుతూ ఉంటాయి. పెదవులకు తేమనందించడానికి, మృదువుగా ఉంచుకోవడానికి లిప్‌బామ్ అప్లై చేసుకుంటూ ఉంటాం. మరి వాటిలోని రసాయనాలు నోటిలోకి వెళితే ప్రమాదం. అయితే వాటిని ఇంట్లోనే చేసుకునే లిప్‌బామ్‌లతో మృదువుగా, తాజాగా మార్చేసుకోవచ్చు.

దానిమ్మగింజలతో... మూడు పెద్ద చెంచాల దానిమ్మ గింజల రసానికి రెండు చెంచాల కొబ్బరి నూనె కలపాలి. దీన్ని గిన్నెలోకి తీసుకుని ఆరేడు నిమిషాలు చిన్న మంటపై వేడి చేయాలి. కాస్త దగ్గరపడింది అనిపించాక పాత్రలోకి తీసుకొని చల్లార్చాలి. దీన్ని లిప్‌బామ్‌లా వాడుకోవచ్చు. దీన్ని ఫ్రీజ్‌లో పెట్టి స్టోర్ చేసుకోవచ్చు. పెద్ద చెంచా పెట్రోలియం జెల్లీని చిన్న గాజుపాత్రలోకి తీసుకోవాలి. దానికి రెండు చెంచాల బీట్‌రూట్ పొడిని కలపాలి. ఒక పాత్రలో బాగా మరిగిన వేడి నీళ్లను తీసుకొని దాంట్లో ఈ పాత్రను ఉంచి, మొత్తం కలిసేదాకా కలపాలి. తర్వాత దాన్ని ఏదైనా చిన్నపాత్రలోకి తీసుకొని ఆరనిస్తే గట్టిపడుతుంది. ఇది పెదాలకు తేమతోపాటు సహజ రంగునీ అందిస్తుంది. దీన్ని ఫ్రీజ్‌లో స్టోర్ చేసుకోవచ్చు.

కోకో పౌడర్... రెండు టీస్పూన్ల పెట్రోలియం జెల్లీని డబుల్ బాయిలింగ్ పద్ధతిలో వేడిచేయాలి. దీనికి చెంచా కోకో పౌడర్ కలిపి కొన్ని సెకన్లు చెంచాతో తిప్పాలి. పొడి డబ్బాలోకి తీసి చల్లారనిచ్చి ఫ్రిజ్‌లో ఉంచి వాడుకోవచ్చు. కోకోపౌడర్‌లో పెదవులను సంరక్షించే సహజ గుణాలున్నాయి. ఇది పెదవులు నల్లగా మారకుండా చూసుకుంటుంది.





రోజా రేకలు... టీస్పూన్ పెట్రోలియం జెల్లీని డబుల్ బాయిలింగ్ పద్ధతిలో కొన్ని సెకన్లు వేడిచేసి, అందులో రోజా రేకల చూర్ణం వేసి కలపాలి. నిమిషం తర్వాత దింపేయాలి. గోరువెచ్చగా ఉన్నప్పుడే ఏదైనా పాత్రలోకి తీసుకోవాలి. దీన్ని ఫ్రీజ్‌లో పెట్టి స్టోర్ చేసుకోవచ్చు. పెద్ద చెంచా పెట్రోలియం జెల్లీని చిన్న గాజుపాత్రలోకి తీసుకోవాలి. దానికి రెండు చెంచాల బీట్‌రూట్ పొడిని కలపాలి. ఒక పాత్రలో బాగా మరిగిన వేడి నీళ్లను తీసుకొని దాంట్లో ఈ పాత్రను ఉంచి, మొత్తం కలిసేదాకా కలపాలి.గులాబీలోని గుణాలు పెదాలకు పోషణను అందించి మంచి రంగును అందిస్తాయి.

షియా బటర్.. టేబుల్ స్పూన్ చొప్పున షియా బటర్, బీస్ వ్యాక్స్‌లను ఓ గిన్నెలోకి తీసుకోవాలి. ఈ మిశ్రమానికి రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె చేర్చి డబుల్ బాయిలింగ్ పద్ధతిలో వేడి చేయాలి. కరిగేవరకూ ఈ మిశ్రమాన్ని గరిటెతో తిప్పుతూ ఉండాలి. టీస్పూన్ పెట్రోలియం జెల్లీని డబుల్ బాయిలింగ్ పద్ధతిలో కొన్ని సెకన్లు వేడిచేసి, అందులో రోజా రేకల చూర్ణం వేసి కలపాలి. నిమిషం తర్వాత దింపేయాలి. గోరువెచ్చగా ఉన్నప్పుడే ఏదైనా పాత్రలోకి తీసుకోవాలి.తర్వాత దాన్ని కిందకి దింపి మూత ఉన్న చిన్న గాజు డబ్బాలో పోయాలి. చివరగా ఈ ద్రవానికి రెండు చుక్కల రోజ్ ఆయిల్‌ని కూడా చేర్చి...చల్లారనిస్తే సరి. నేచురల్ లిప్‌బామ్ తయారైపోతుంది.

# ప్రైవేట్‌కు స్వాగతం.. ప్రభుత్వ సంస్థలకు వీడ్కోలు



ఎవరి స్థలంలో వాళ్లు ఇల్లు కట్టుకోవడం సహజం. అదే మన స్థలం మరెవరికో ఇచ్చి, మనం వెళ్లి పక్కవాళ్ల స్థలంలో ఇల్లు కట్టుకుంటే ఎలా ఉంటుంది? విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఇలాగే ఉంది.

ఎవరి స్థలంలో వాళ్లు ఇల్లు కట్టుకోవడం సహజం. అదే మన స్థలం మరెవరికో ఇచ్చి, మనం వెళ్లి పక్కవాళ్ల స్థలంలో ఇల్లు కట్టుకుంటే ఎలా ఉంటుంది? విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఇలాగే ఉంది. మన రాష్ట్రంలో కొత్త విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశాన్ని ప్రైవేట్‌కు కట్టబెడుతున్నది. మరోవైపు ప్రభుత్వరంగ సంస్థలైన జెన్‌కో, సింగరేణి ద్వారా ఇతర రాష్ట్రాల్లో ప్లాంట్లు ఏర్పాటుచేసేందుకు ప్రయత్నిస్తున్నది. మన దగ్గర ప్రైవేట్ ప్లాంట్లకు గేట్లు తెరిచి, మన విద్యుత్తు సంస్థల చేత రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యుత్తు ప్లాంట్లను నిర్మిస్తున్నది. ప్రభుత్వ తీరును విద్యుత్తురంగ నిపుణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇదేం పద్ధతి అంటూ ప్రశ్నిస్తున్నారు.

**జెన్‌కో, సింగరేణితో ఇతర రాష్ట్రాల్లో పనులు**

విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం, నిర్వహణ విషయంలో జెన్‌కో, సింగరేణి సంస్థలు ఆరితేరాయి. జెన్‌కో థర్మల్, హైడల్ విద్యుత్తు ప్లాంట్లు నిర్మించగా.. సింగరేణి థర్మల్, సోలార్ ప్లాంట్లను నిర్మించడంతోపాటు రామగుండంలో కొత్తగా పంప్‌స్టోరేజీ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టింది. ఈ రెండు సంస్థలను కాదని ప్రభుత్వం కొత్త పవర్ ప్లాంట్ల నిర్మాణాన్ని ప్రైవేట్‌కు కట్టబెడుతున్నది. ఆ రెండు సంస్థల చేత రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో కొత్త ప్లాంట్లు పెట్టిస్తున్నది. ప్రభుత్వ సంస్థలతో సొంత రాష్ట్రాన్ని వదిలి ఇతర రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టించడం ఎందుకో.. దీని వెనుకున్న మతలబేమిటోనని నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**ఇతర రాష్ట్రాల్లో మనంపెట్టేవి..**

టీజీ జెన్‌కో హిమాచల్‌ప్రదేశ్‌లో బిల్డ్ ఆపరేషన్ అండ్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) పద్ధతి లో జలవిద్యుత్తు కేంద్రం (హైడల్) నిర్మాణనికి సంప్రదింపులు జరుపుతున్నది.

సింగరేణి సంస్థ రాజస్థాన్‌లో 3,100 మెగావాట్ల విద్యుత్తు పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ఎంవోయూలు కుదుర్చుకుంది. 1600 మెగావాట్ల థర్మల్, 1,500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లను నెలకొల్పనుంది.

సింగరేణి సంస్థ ఒడిశాలోని నైనీలో 1, 600 మెగావాట్ల సామర్థ్యం గల థర్మల్ విద్యుత్తు ప్లాంట్‌ను నెలకొల్పనుంది.

**మన రాష్ట్రంలోకి ప్రైవేట్ పెట్టుబడులు**

సన్ పెట్రోకెమికల్స్ సంస్థ రూ.45 వేల కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ఎంఓయూ కుదుర్చుకున్నది. ఈ సంస్థ నాగర్‌కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ఈ సంస్థ 3,400 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది.

మెగా ఇంజినీరింగ్ లిమిటెడ్ సంస్థ 11వేల కోట్ల పెట్టుబడులతో 2,160 మెగావాట్ల సామర్థ్యం గల పంప్డ్ స్టోరేజీ పవర్‌ప్లాంట్లను నెలకొల్పనుంది.

మెగా ఇంజినీరింగ్ లిమిటెడ్ సంస్థ మరో 3వేల కోట్లను రాష్ట్రంలో పెట్టుబడి పెట్టి, వెయ్యి మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ (బీఈఎస్ఎస్) ప్లాంట్‌ను నెలకొల్పనుంది.మైత్రా ఎనర్జీ సంస్థ 7వేల కోట్లు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఈ సంస్థ 2,400 మెగావాట్ల సోలార్ సెల్, మరో 2,400మెగావాట్ల సోలార్ మాడ్యూల్ మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్‌ను నెలకొల్పనుంది.

హడావిడిగా పాలసీ.. అందుకేనా క్లీన్ ఎనర్జీని ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం ఇటీవలే గ్రీన్ ఎనర్జీ పాలసీని రూపొందించింది. ఈ పాలసీకి క్యాబినెట్‌లో ఆమోదం లభించింది. అయితే దావోస్ పర్యటనలో భాగంగా రాష్ట్రప్రభుత్వం విద్యుత్తు రంగంలో 66 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకున్నది. దావోస్ సదస్సుకు ముందే సర్కారు గ్రీన్ ఎనర్జీ పాలసీని తీసుకొచ్చింది. తాజాగా వచ్చిన పెట్టుబడులన్నీ గ్రీన్ ఎనర్జీ రంగానికి సంబంధించినవే. అంటే దావోస్ సదస్సుకు ముందే పాలసీ రూపొందించడం వెనుక ఈ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానించాలన్న ముందస్తు కుట్ర దాగి ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయి. హడావిడిగా పాలసీ రూపకల్పన వెనుక ఇదే కోణం దాగి ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

# రుణగ్రహీతలకు ఎస్బీఐ శుభవార్త..




బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రుణ గ్రహీతలకు శుభవార్తను అందించింది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్-బేస్డ్ లెండింగ్ రేటు(ఈబీఎల్ఆర్), రెపో లింక్డ్ లెండింగ్ రేటు(ఆర్ఎల్ఎల్ఆర్)తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేట్లను పావు శాతం మేర తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది.

బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) రుణ గ్రహీతలకు శుభవార్తను అందించింది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్-బేస్డ్ లెండింగ్ రేటు(ఈబీఎల్ఆర్), రెపో లింక్డ్ లెండింగ్ రేటు(ఆర్ఎల్ఎల్ఆర్)తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేట్లను పావు శాతం మేర తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. దీంతో గృహ, వ్యక్తిగత రుణాలతోపాటు ఇతర రుణాలపై చెల్లించే ఈఎంఐలు తగ్గనున్నాయి. ఈ నూతన రేట్లు శనివారం నుంచి అమలులోకి వచ్చాయి. రిజర్వుబ్యాంక్ ఇటీవల రెపోరేటును 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఎస్బీఐ ఈ నిర్ణయం తీసుకున్నది.

దీంతో ఈబీఎల్ఆర్ రేటు పావు శాతం తగ్గించడంతో రేటు 9.15 శాతం నుంచి 8.90 శాతానికి దిగొచ్చింది. అలాగే ఆర్ఎల్ఎల్ఆర్ కూడా 8.50 శాతానికి దించింది. ఆర్బీఐ విధించిన రెపోరేటు ఆధారంగా బ్యాంకులు దీనికి అనుగుణంగా రుణాలపై వడ్డీరేట్లను నిర్ణయిస్తుంటాయి. సెంట్రల్ బ్యాంక్ గతవారంలో రెపోరేటును తగ్గించడంతో బ్యాంకులు ఒక్కోక్కటి రుణాలపై వడ్డీరేటును తగ్గిస్తున్నాయి. ఎస్బీఐ కూడా ఈ నిర్ణయం తీసుకున్నది. కానీ, మార్జినల్ కాస్ట్-బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్), బేస్‌రేటు, బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు(బీపీఎల్ఆర్)ని యథాతథంగా ఉంచింది బ్యాంక్.

ఎస్బీఐకి రూ.30 కోట్లు తెలంగాణకు చెందిన రిఫైనరీ కంపెనీ శీతల్ రిఫైనరీస్ లిమిటెడ్, మరికొన్ని సంస్థల రుణ మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రూ.30 కోట్లకుపైగా విలువైన ఆస్తులను రికవరీ చేసి ఎస్బీఐకి అప్పగించింది.

**మరిన్ని బ్యాంకులు కూడా..**

ఎస్బీఐ బాటలోనే మరిన్ని బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించాయి. వీటిలో కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లు ఉన్నాయి. దీంట్లో కెనరా బ్యాంక్ ఆర్ఎల్ఎల్ఆర్‌తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేటును 9.25 శాతం నుంచి 9 శాతానికి దించింది. మరోవైపు బ్యాంక్ ఆఫ్ బరోడా కూడా బీఆర్ఎల్ఎల్ఆర్ వడ్డీరేటును 8.90 శాతానికి దించింది. ఈ వడ్డీరేట్లు ఈ నెల 10 నుంచే అమలులోకి వచ్చాయి. అలాగే ఈ నెల 7 నుంచి అమలులోకి వచ్చేలా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్ఎల్ఎల్ఆర్ రేటుని 9.35 శాతం నుంచి 9.10 శాతానికి తగ్గించింది. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ కూడా 9.10 శాతానికి తగ్గించగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా రెపోతో అనుసంధానమై రుణాలపై వడ్డీరేటును 9.25 శాతం 9 శాతానికి తగ్గించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సైతం ఆర్ఎల్ఎల్ఆర్ వడ్డీరేటును 9 శాతానికి కోత పెట్టింది.

# బజాజ్ కన్స్యూమర్ కేర్ చేతికి విశాల్ పర్సనల్ కేర్

హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న విశాల్ పర్సనల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ముంబై ఆధారిత బజాజ్ కన్స్యూమర్ కేర్ లిమిటెడ్ సొంతం చేసుకుంటున్నది. రెండు విడుతల్లో జరుగనున్న ఈ డీల్ విలువ రూ.120 కోట్లుగా అంచనా వేస్తున్నారు.

హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న విశాల్ పర్సనల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ముంబై ఆధారిత బజాజ్ కన్స్యూమర్ కేర్ లిమిటెడ్ సొంతం చేసుకుంటున్నది. రెండు విడుతల్లో జరుగనున్న ఈ డీల్ విలువ రూ.120 కోట్లుగా అంచనా వేస్తున్నారు. విశాల్ పర్సనల్ కేర్‌లో తొలుత 49 శాతం వాటాను, ఆ తర్వాత మిగతా 51 శాతం వాటాను బజాజ్ కన్స్యూమర్ కేర్ కొనుగోలు చేయబోతున్నది. ఇక విశాల్ పర్సనల్ కేర్‌లో 2012లో ప్రైవేట్ ఈక్విటీ సంస్థ పీపుల్ క్యాపిటల్ పెట్టుబడులు పెట్టింది. ఇప్పుడు ఈ వాటాలనూ బజాజ్ కన్స్యమర్ కేర్ కొనాల్సి ఉన్నది. కాగా, ప్రస్తుతం మార్కెట్‌లో బంజారా బ్రాండ్ పేరిట




వివిధ శిరోజ, చర్మ సంరక్షణ ఉత్పత్తులను విశాల్ పర్సనల్ కేర్ విక్రయిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజా లావాదేవీ పూర్తయితే ఈ బ్రాండ్ బజాజ్ కన్స్యూమర్ కేర్ గూటికి వెళ్లిపోనున్నది. 'ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో బజాజ్ కన్స్యూమర్ కేర్ వ్యాపార కార్యకలాపాల బలోపేతానికి విశాల్ పర్సనల్ కేర్ కొనుగోలు వ్యూహాత్మకంగా కలిసిరాగలదు' అని ఈ సందర్భంగా బజాజ్ కన్స్యూమర్ కేర్ ఎండీ జైదీప్ నంది అన్నారు. శుక్రవారం జరిగిన తమ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో విశాల్ పర్సనల్ కేర్ కొనుగోలుకు ఆమోదం లభించినట్టు ఆయన చెప్పారు. ఇక గత ఆర్థిక సంవత్సరం (2023-24) విశాల్ పర్సనల్ కేర్ రెవిన్యూ రూ.51 కోట్లుగా ఉన్నది. దీన్ని 1991లో స్థాపించారు. హెర్బల్ పౌడర్లు, అలోవెరా జెల్స్, షాంపూలు, హెయిర్ కేర్ పౌడర్లు అమ్ముతున్నది. ఏపీ, తెలంగాణసహా ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో దీనికి 70వేలకుపైగా ఔట్‌లెట్లున్నాయి. ఇదిలావుంటే కుషగ్ర బజాజ్ నేతృత్వంలోని 2.5 బిలియన్ డాలర్ల విలువైన బజాజ్ గ్రూప్‌లోగల ఎఫ్ఎంసీజీ కంపెనీయే బజాజ్ కన్స్యూమర్ కేర్. గత ఆర్థిక సంవత్సరం దీని ఆదాయం రూ.967.71 కోట్లు, లాభం రూ.158.77 కోట్లుగా ఉన్నది. బజాజ్ ఆల్మండ్ డ్రాప్స్ ఆయిల్, కోకోనట్ ఆయిల్, సబ్బులు, సీరమ్స్, షాంపూలు, కండీషనర్లను అమ్ముతున్నది. ఇక ఈ డీల్‌తో ఉత్తరాది మార్కెట్లలో బంజారా బ్రాండ్‌ను విస్తృతపర్చాలని బజాజ్ భావిస్తున్నది.

# సెక్షన్‌వారీగా మ్యాపింగ్ ఆదాయ పన్ను (ఐటీ)

ఆదాయ పన్ను (ఐటీ) చెల్లింపుదారులు పాత ఐటీ చట్టం 1961లోని సెక్షన్లతో కొత్త ఐటీ బిల్లు 2025లోని క్లాజులను సరిపోల్చుకునే అవకాశాన్ని ఐటీ శాఖ కల్పించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల దాదాపు 65 ఏండ్ల ఐటీ చట్టం స్థానంలో నూతన ఐటీ చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే పాతదాంట్లో సెక్షన్లుంటే.. కొత్తదాంట్లో వాటికి బదులుగా కొన్ని క్లాజులను ప్రతిపాదించారు. దీంతో ఏ సెక్షన్.. ఏ క్లాజుగా మారిందో తెలియక ట్యాక్స్‌పేయర్స్ గందరగోళంలో పడిపోయారు. నిజానికి కొత్త ఆదాయ పన్ను విధానాన్ని ఎంచుకొనేవారికి ఈ సెక్షన్లతో ఎలాంటి పనీ లేదు. కానీ పాత ఆదాయ పన్ను విధానాన్ని అనుసరించేవా రికి సెక్షన్లు తప్పనిసరి.

వయసు ఆధారంగా గరిష్ఠంగా ఆయా పొదుపు, పెట్టుబడులు, ఖర్చులు, చెల్లింపులపై రూ.11 లక్షల నుంచి 15 లక్షలదాకా పన్ను మినహాయింపు ప్రయోజనాలను పొందవచ్చు మరి. దీంతో కొత్త ఐటీ చట్టంలో కీలకమైన సెక్షన్లను క్లాజులుగా మార్చడంతో ట్యాక్స్‌పేయర్స్ ఐటీ రిటర్నుల సమయంలో ఇబ్బందిపడే ప్రమాదం ఏర్పడుతున్న ది. దీనిపైన అటు ట్యాక్స్‌పేయర్స్ నుంచి ఇటు ఎక్స్‌పర్ట్స్ నుంచి ఆందోళనలు, విమర్శలూ వెల్లువెత్తాయి. ఇక ఇప్పటికే పాత ఆదాయ పన్ను విధానం జోలికి వెళ్లకుండా ప్రతీ బడ్జెట్ లో కొత్త ఆదాయ పన్ను విధానంలోనే సవరణలు చేస్తూ వస్తున్న మోదీ సర్కారు.. పాత ఆదాయ పన్ను విధానానికి పూర్తిగా చరమగీతం పాడేందుకే ఈ కొత్త ఐటీ బిల్లు, సెక్షన్ల మార్పు చేపట్టిందన్న ఆరోపణలూ వచ్చాయి.

ఈ క్రమంలోనే సెక్షన్ టు క్లాజ్ అర్థం చేసుకునేలా ఐటీ శాఖ వెబ్‌సైట్‌లో పాత ఆదాయ పన్ను చట్టంతో కొత్త ఆదాయ పన్ను బిల్లును మ్యాపింగ్ చేస్తూ అప్‌లోడ్ చేశారు. పాత ఐటీ చట్టాన్ని సరళతరం చేస్తామని కొత్త ఐటీ బిల్లును ఈ నెల 13న లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఇందులో 2.60 లక్షల పదాలు, 536 సెక షన్లు, 23 చాప్టర్లు, 57 టేబుళ్లున్నాయి. అలాగే ట్యాక్స్ ఇయర్ విధానాన్ని పరిచయం చేశారు. ప్రస్తుత చట్టంలో ఆర్థిక సంవత్సరం (ఎఫ్‌వై), మదింపు సంవత్సరం (ఏవై)గా ఉండగా, వీటిని ట్యాక్స్ ఇయర్‌గా మార్చారు.

# అబ్బాయిలూ బీ కేర్ ఫుల్..

లవ్ అండ్ స్పేస్ డేటింగ్ సిమ్యులేషన్ గేమ్.. చైనాలో విపరీత ఆదరణ పొందుతోంది. అక్కడి అమ్మాయిలకు ఈ గేమ్ బాగా నచ్చుతోందట. ప్రతి నెలా సుమారుగా 60 లక్షల మంది యాక్టివ్ ప్లేయర్లు ఉన్నట్లు లెక్కలు చెప్తున్నాయి. అలాగే ఈ గేమ్ సృష్టికర్త ఏకంగా బిలియనీర్ అయ్యారని ఫోర్బ్స్ తన కథనంలో పేర్కొంది. అసలేంటీ లవ్ అండ్ స్పేస్ డేటింగ్ సిమ్యులేషన్ గేమ్.. చైనా యువతులకు అంతలా నచ్చడంలో కారణమేంటీ.. తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు.. ఇదిగో ఇలాగే మొదలౌతుంది ప్రతీ లవ్ స్టోరీ. గుండెల్లో గంటలు మోగకపోయినా.. నచ్చిన చిన్నది లేదా చిన్నోడు కనపించగానే కాస్త సన్నగానైనా మదిలో వీణలు మోగుతుంటాయి. గుండె వేగంగా కొట్టుకోవడం కామన్. ఆ తర్వాత వాళ్ల కళ్లల్లో పడాలనే తాపత్రాయం.. వారి దృష్టిని ఆకర్షించాలనే ప్రయత్నం.. అలా చూపులు కలిసిన శుభవేళ.. రెండు గుండెలు ఒక్కటే ప్రేమగీతం పాడుతుంటాయి. కొన్ని రోజులు బాగానే గడుస్తాయి. ప్రియా నిను చూడలేక అంటూ నిరంతరం వారి ధ్యాసే, ప్రతీ క్షణం వారి ఊహే, ఊహలు గుసగుసలాడే అంటూ మెసేజ్‌లు, వాట్సాప్ కాల్స్.. ప్రేమ యాత్రలకు బృందావనమూ, నందనవనమూ ఏలోనో అంటూ పార్కులు, పబ్బుల చుట్టూ షికార్లు.. ఆ తర్వాత మొదలౌతుంది అసలు సంగతి.

అతగాడికేమో.. ఉద్యోగం చేస్తుంటే పని ఒత్తిడి, జాబ్ లేకుంటే ఉద్యోగం సంపాదించాలనే టెన్షన్.. అటు అమ్మాయి సంగతీ అలాగే ఉంటుందనుకోండి. అయితే నచ్చిన వాడితో కాసేపు మనసు విప్పి మాట్లాడుకోవాలని, ప్రేమ మొదలైన రోజుల్లో మాదిరిగా చాటింగ్, ఫోన్ కాల్స్ చేయాలనే ఆశ. ఇక్కడ చూస్తే ఫుల్ బిజీ షెడ్యూల్, గతంలో మాదిరిగా సమయం కుదరకపోవచ్చు. ఇలాంటి సమస్యలు రిలేషన్‌షిప్, ప్రేమ.. పేరేదైనా సర్వసాధారణం. తమ రోజువారీ జీవితంలో ఏం జరిగిందనేదీ ప్రతిదీ తమ బాయ్ ఫ్రెండ్‌తో చెప్పుకోవాలని, కష్టసుఖాలు పంచుకోవాలని అనుకుంటారు అమ్మాయిలు. కానీ తమ బాయ్ ఫ్రెండ్ ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని, మెసేజులకు త్వరగా స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేస్తుంటారు. ప్రతీ ప్రేయసీ.. తన ప్రేమికుడిపై చేసే కంప్లైంట్స్ ఇవే.

అయితే ఈ సమస్యలకు సాంకేతికత సాయంతో చెక్ పెట్టే ప్రయత్నం చైనాలో జరుగుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో పనిచేసే ఏఐ బాయ్ ఫ్రెండ్స్ ఇప్పుడు చైనాలో నయా ట్రెండ్.



అక్కడ ఇప్పుడు డేటింగ్ సిమ్యులేషన్ గేమ్‌కు ఆదరణ పెరుగుతోంది. అలాగే ఈ ఏఐ బాయ్ ఫ్రెండ్స్‌ను సృష్టించిన వ్యాపారవేత్త ఏకంగా బిలియనీర్ అయ్యారు. ఫోర్బ్స్ కథనం ప్రకారం.. డేటింగ్ సిమ్యులేషన్ గేమ్.. లవ్ అండ్ స్పేస్‌కు ప్రతి నెలా 60 లక్షల మంది యాక్టివ్ ప్లేయర్లు ఉన్నారు. షాంఘైకు చెందిన పేపర్ గేమ్స్ సంస్థ 2024 జనవరిలో ఈ లవ్ అండ్ స్పేస్ డేటింగ్ సిమ్యులేషన్ గేమ్ లాంఛ్ చేసింది. ఈ గేమ్.. ఏఐ సాయంతో పనిచేస్తుంది. అలాగే ఐదు రకాల మగ గొంతులతో దీనిని రూపొందించారు. ఒక అమ్మాయి తన బాయ్ ఫ్రెండ్ ఎలా ఉండాలని కోరుకుంటుందో.. అలాంటి బాయ్ ఫ్రెండ్‌ను ఇందులో సృష్టించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేసే ఈ వర్చువల్ బాయ్ ఫ్రెండ్.. అమ్మాయిలు లేదా యూజర్ల సందేశాలకు త్వరగా స్పందిస్తాడు. అలాగే వారి ఫోన్ కాల్స్‌కు వెంటనే సమాధానమిస్తూ, వారికి నచ్చినట్లు ఎంత సేపైనా ఓపికగా వింటూ, మాట్లాడుతూ ఉంటాడు. ఈ డేటింగ్ సిమ్యులేషన్ యాప్ ఇప్పుడు చైనా యువతులకు విపరీతంగా నచ్చేసింది. దీంతో పేపర్ గేమ్స్ సృష్టికర్త యావో రున్వావో బిలియనీర్ అయినట్లు ఫోర్బ్స్ తెలిపింది. యావో సంపద భారతీయ కరెన్సీ ప్రకారం 130 కోట్లకు చేరినట్లు తెలిపింది. అలాగే కంపెనీలోనూ మెజారిటీ వాటా యావో పేరిట ఉంది. ఈ స్మార్ట్ ఫోన్ గేమ్ ప్రస్తుతం చైనీస్, ఇంగ్లీష్, జపనీస్, కొరియన్ భాషలలో అందుబాటులో ఉంది. బాయ్ ఫ్రెండ్‌లకు ప్రత్యామ్నాయంగా ఉన్న లవ్ అండ్ స్పేస్ డేటింగ్ సిమ్యులేషన్ గేమ్ చైనా యువతులకు విపరీతంగా నచ్చుతున్న నేపథ్యంలో.. ఇది మన దాకా రాకముందే అబ్బాయిలూ మీ గర్ల్ ఫ్రెండ్‌ను కాస్త పట్టించుకోండి.. ఆమే చెప్పేది కాస్త ఓపికగా వింటూ, నచ్చినట్లు ఉండండి అంటున్నారు ఈ వార్త తెలిసిన నెటిజనం.

# కోడలికి ఎయిడ్స్ ఇంజెక్షన్..

అత్తగారింట్లో కోడలిని ముప్పు తిప్పలు పెట్టిన సంఘటనలు చూస్తూనే ఉన్నాం. ఇలాంటివి ప్రతీ ఇంట్లోనూ సర్వసాధారణమే అని అనుకుంటాం. కానీ కొన్ని ఘటనలు మాత్రం అంతకుమించి ఉంటాయి. కోడలిని అత్తామామ, కట్టుకున్న భర్త.. అత్తింట్లో ఎంత హింసకు గురి చేస్తారు అనేవి చాలానే చూసి ఉంటాం. కానీ ఈ ఘటన గురించి వింటే మాత్రం.. ఆ అత్తామామలు రాక్ష సుల కంటే దారుణం అని అనుకోక మానరు. ఎందుకంటే కోడలికి.. ఆ అత్తమామలు ఎయిడ్స్ ఇంజెక్షన్ ఇచ్చారు. ఇంతకీ వాళ్లు ఎందుకు అలా చేశారు. ఆ కోడలికి అత్తగారింట్లో అడుగడు గునా వేధింపులే ఎదురయ్యాయి. భర్తను, అత్తామామలను ఎంత బాగా చూసుకున్నా.. వారు కనికరించలేదు. కూతురిలాగా చూడాల్సిన అందుకు రూ.25 లక్షలు పుట్టింటి నుంచి తీసుకురావాలని.. ఆ యువతిని అత్తామామలు వేధించసాగారు.

అయితే జరిగిన విషయాన్ని పుట్టింటివారికి ఆ యువతి చెప్పగా.. అంత డబ్బు తాము ఇచ్చుకోలేమని వారు చెప్పడంతో.. ఆ యువతిని ఇంటి నుంచి పుట్టింటికి వెళ్లగొట్టారు. దీంతో గ్రామంలో పంచాయితీ పెద్దలను ఆశ్రయించ గా.. అత్తింటివారికి నచ్చజెప్పి ఆ యువతిని తిరిగి కాపురానికి పంపించారు. అయినప్పటికీ బుద్ధి మారని ఆ అత్తమామలు.. ఆమెను మరిన్ని డబ్బులు తీసుకురావాలనే వేధింపులు మాత్రం ఆపలేదు. అదనపు కట్నం తీసుకురావాలని ఆ యువతిని మానసికంగా, శారీరకంగా తీవ్ర చిత్రహింసలకు గురి చేశారు. ఈ క్రమంలోనే తమ కుమారుడికి మరో పెళ్లి చేస్తే.. మళ్లీ



కోడలిని.. వారు కనీసం మనిషిగా కూడా చూడలేదు. పుట్టింటి నుంచి భారీగా కట్నం తీసుకువచ్చినా.. మరింత కట్నం తీసుకురావాలని ఒత్తిడి తీసుకువచ్చారు. వినకపోవడంతో ఆమెను చిత్రహింసలకు గురి చేశారు. ఈ క్రమంలోనే ఎంతకు తెగించారంటే.. అత్తమా మలు కలిసి.. కోడలికి ఎయిడ్స్ ఇంజెక్షన్ కూడా ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఆ యువతి తండ్రి.. కోర్టును ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఉత్తరాఖండ్‌లో జరిగిన ఈ ఘటన ఇప్పుడు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఉత్తర్‌ప్రదేశ్ సహరాన్‌పూర్‌కు చెందిన ఒక యువతికి.. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు చెందిన అభిషేక్ అలియాస్ సచిన్‌తో పెళ్లి జరిగింది. 2023 ఫిబ్రవరి 15వ తేదీన వారి వివాహం జరిగింది. కట్నకానుకల కింద యువతి తల్లిదండ్రులు మొత్తంగా రూ.15 లక్షలు ముట్టజెప్పారు. ఈ క్రమంలోనే పెళ్లి జరిగిన కొన్నిరోజులు ఆ యువతి పట్ల భర్త, అత్తామామలు బాగానే ఉన్నా.. ఆ తర్వాతే వాళ్ల అసలు రాక్షసరూపం బయటికి వచ్చింది. కట్నం డబ్బులు కాకుండా.. స్కార్పియో కారు కొనాల ని.. కట్నం వస్తుందని ఆశపడ్డ తల్లిదండ్రులు ఆ యువతిని హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే భయంకరమైన ఎయిడ్స్ వ్యాధి కలిగిన ఇంజెక్షన్‌ను ఆ యువతికి ఇచ్చారు. ఆ ఇంజెక్షన్ ఇచ్చిన కొన్నిరోజులకు ఆ యువతి తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఆస్పత్రికి తీసుకెళ్లి మెడికల్ టెస్ట్‌లు చేయించగా.. ఆమెకు హెచ్ఐవీ సోకినట్లు డాక్టర్లు చెప్పడంతో అంతా షాక్ అయ్యారు. దీంతో ఆమె భర్త అభిషేక్‌కు ఎయిడ్స్ టెస్ట్ చేయగా.. అతడికి హెచ్ఐవీ లేదని తేలింది. దీంతో బాధితురాలి కుటుంబసభ్యులు ఆమె అత్తమామలపై అనుమానంతో.. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవ డంతో.. చివరికి బాధితురాలు తండ్రి స్థానిక కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో గంగో కొత్వాలి పోలీసులు.. అభిషేక్, అతని తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపులు, దాడి, హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అనంతరం ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

# మహా కుంభమేళాలో మరో అగ్ని ప్రమాదం..



**మహా కుంభ్‌నగర్‌లో తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటుండటం.. తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఇప్పటివరకు 2 సార్లు మహా కుంభమేళాలో ఫైర్ యాక్సిడెంట్లు జరిగాయి. తాజాగా శనివారం మరోసారి మహా కుంభమేళాలో అగ్ని ప్రమాదం జరిగింది. మహా కుంభ్‌నగర్‌లోని లవకుష్ ధామ్ శిబిరంలో ఈ అగ్నిప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడిం చారు. ఈ అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని.. ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. అయితే ఈ అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం ఏమీ జరగలేదని వెల్లడించారు.**

మహా కుంభమేళాలో మరోసారి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కుంభమేళా ప్రారంభం అయినప్పటినుంచి ఫైర్ యాక్సిడెంట్ జరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం. గతంలో రెండుసార్లు అగ్ని ప్రమాదాలు జరగ్గా.. తాజాగా మళ్లీ మంటలు అంటుకున్నాయి. దీంతో టెంట్లు కాలిబూడిదయ్యాయి. అయితే ఈ అగ్ని ప్రమదాంలో ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు కోట్లాది మంది భక్తులు తరలివస్తున్నారు. మరికొన్ని రోజుల్లో మహా కుంభమేళా ముగియనున్న నేపథ్యంలో రోజురోజుకూ భక్తుల తాకిడి పెరుగుతోంది. ఈ క్రమంలోనే మహా కుంభమేళా నిర్వహణ కోసం.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం.. అనేక చర్యలు చేపడుతోంది. అయితే మహా కుంభమేళా సందర్భంగా మహా కుంభ్‌నగర్‌లో తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటుండటం.. తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఇప్పటివరకు 2 సార్లు మహా కుంభమేళాలో ఫైర్ యాక్సిడెంట్లు జరిగాయి. తాజాగా శనివారం మరోసారి మహా కుంభమేళాలో అగ్ని ప్రమాదం జరిగింది.

మహా కుంభ్‌నగర్‌లోని లవకుష్ ధామ్ శిబిరంలో ఈ అగ్నిప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని.. ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. అయితే ఈ అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం ఏమీ జరగలేదని వెల్లడించారు. ఈ అగ్ని ప్రమాదం కారణంగా అక్కడ ఏర్పాటు చేసిన మండపాలు, టెంట్లు కాలిబూడిదయ్యాయి. కాగా ఈ అగ్ని ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడి కాలేదు.

మహా కుంభమేళాలో ఇప్పటికే రెండుసార్లు అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఫిబ్రవరి 9వ తేదీన సెక్టార్-23లో గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా ఫైర్ యాక్సిడెంట్ సంభవించింది. వెంటనే ఫైరింజన్లను తరలించి మంటలను అదుపు చేశాయి. అంతకుముందు జనవరి 30వ తేదీన తొలిసారి అగ్నిప్రమాదం జరిగింది. ఛత్నాగ్ ఘాట్ వద్ద టెంట్ సిటీలో మంటలు చెలరేగి.. దాదాపు 10 టెంట్లు దగ్ధం అయ్యాయి. మొత్తం మీద.. మహా కుంభమేళా ప్రారంభం నుంచి అనేక అగ్నిప్రమాదాలు సంభవించాయి. జనవరి 19వ తేదీన గోరఖ్‌పూర్‌లోని గీతా ప్రెస్ క్యాంప్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనతో 150కి పైగా కుటుంబాలు ప్రభావితం అయ్యాయి. ఆ అగ్నిప్రమాదానికి గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణమని తెలుస్తోంది. అయితే గీతా ప్రెస్ వ్యక్తులు మాత్రం అగ్నిప్రమాదం బయటి వారి వల్ల జరిగిందని పేర్కొన్నారు.



## దీనస్థితిలో పదిరోజులుగా నడిరోడ్డుపై తల్లీకూతురు..

ఆమెది మహబూబ్‌నగర్ జిల్లా మారేడుపల్లి. ఆరు నెలల కిందటే అనారోగ్యంతో భర్త కాలం చేశాడు. భర్త చనిపోయిన నెల రోజులుకే.. రోడ్డు ప్రమాదంలో కుమారుడు కూడా మరణించాడు. ఓవైపు భర్త, కుమారుడు చనిపోయారన్న బాధ చంపేస్తోన్నా.. ఆరేళ్ల కూతురి బాధ్యత తనపై ఉందన్న ఒకే ఒక్క కారణం తనను బతికిస్తోంది. కానీ.. విధి ఎంత కఠినమైనదంటే.. ఇంత బాధలో, ఇన్ని కష్టాల్లో ఉన్న ఆమె తీవ్ర అనారోగ్యానికి గురయ్యేలా చేసింది. విధికంటే మనుషులు ఇంకా కఠినాత్ములు కాబోలు.. ఆధార్ కార్డు లేదన్న కారణంతో వైద్యం చేసేందుకు నిరాకరించటంతో.. పది రోజులుగా రోడ్డుపైనే అత్యంత దీనస్థితిలో కాలం వెళ్లదీస్తున్నారు.

సమాజంలో రోజురోజుకు మానవత్వం సన్నగిల్లుతోంది. మనుషుల్లో క్రూరత్వం, కాఠిన్యం పెరిగిపోతురీ.. కనికరం, జాలి, కరుణ, సహాయ గుణాలకు చోటులేకుండా పోతోంది. అందుకు నిదర్శనమే.. పదిరోజులుగా నడిరోడ్డుపై తల్లీకూతుర్లు దీనమైన పరిస్థితి. తల్లికి ఏమైందో తెలియదు.. ఎందుకు ఆస్పత్రిలో చేర్చుకోలేదో అర్థం కాదు.. ఏం చెయ్యాలో తోచని ఆ చిన్నారి.. ఒడిలో అమ్మను పడుకోబెట్టుకుని సపర్యలు చేస్తున్న దీనస్థితి చూస్తుంటే.. గుండెల్లో నుంచి కన్నీళ్లు రాకమానదు. అలాంటిది.. ఆస్పత్రి సిబ్బందికి మాత్రం ఇవేవి అవసరం లేదు. ఆధార్ కార్డు లేదన్న ఒకే ఒక్క కారణంతో.. ఆమె పరిస్థితి కూడా అర్థం చేసుకోకుండా నిర్లక్ష్యంగా వైద్యం చేసేందుకు నిరాకరించారు. దీంతో.. దిక్కుతోచని పరిస్థితిలో, ఏ దిక్కుకెళ్లాలన్న సత్తువలేదని దుస్థితిలో.. అక్కడే రోడ్డుపైనే పది రోజులుగా కాలం వెళ్లదీస్తున్నారు ఆ తల్లీకూతుళ్లు.

అసలు ఆ మహిళ భర్త ఎటు పోయాడు.. ముందు వాడిని పట్టుకుని తన్నాలి. అనారోగ్యంతో ఉన్న తల్లిని, చిన్నపిల్లని వదిలేసి వాడు ఏం వెలగబెడుతున్నాడంటూ.. మనకు ఎక్కడలేని కోపం రావటం సహజమే. కానీ.. అసలు బాధకరమైన విషయం ఏమిటంటే.. మహబూబ్‌నగర్ జిల్లా మారేడుపల్లికి చెందిన ప్రమీల అనే ఈ మహిళ భర్త సురేష్.. ఆరు నెలల కింద అనారోగ్యంతో కన్నుమూశాడు. ఆ బాధలో నుంచి పూర్తిగా కోలుకోకముందే.. నెల రోజులకే కొడుకు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు వదిలాడు. అటు భర్త, ఇటు కుమారుడు ఇద్దరూ ఉన్నట్టుండి ప్రాణాలు కోల్పోవటంతో.. ఆ బాధ ఆమెను అన్నిరకాలుగా కుంగదీసింది.

ప్రైవేటు క్లినిక్‌లో కూడా చూపించుకునే పరిస్థితి లేక.. ప్రభుత్వ ఆస్పత్రి అయితే ఉచితంగానే వైద్యం చేస్తారన్న ఆశతో హైదరాబాద్లోని ఉస్మానియా ఆసుపత్రికి తన కూతురిని పట్టుకుని ఎలాగోలా కష్టపడి వెళ్లింది. రోగి ఆరోగ్య పరిస్థితిని చూసి వైద్యం చేయాల్సిన వైద్య సిబ్బంది, రూల్స్ పేరుతో కేవలం ఆధార్ కార్డు లేదన్న కారణంతో వైద్యం చేసేందుకు నిరాకరించారు. ప్రమీలను కనీసం ఆస్పత్రిలో కూడా చేర్చుకోలేదు.

మరెక్కడికైనా వెళ్లి ప్రయత్నిద్దామంటే.. నగరంలో వేరే ఏమీ తెలియదు.. గడ్డమో కాళ్లో పట్టుకుని తెలుసుకునైనా వెళ్దామన్నా ఒంట్లో కదిలేందుకు కూడా సత్తువ లేదు.. నా అనేవారు కూడా ఎవ్వరూ పట్టించుకోకపోవటంతో.. పది రోజులుగా తన కూతురితో ఉస్మానియా ఆస్పత్రి బయటే.. కటిక నేలపై దీనస్థితిలో కాలం వెళ్లదీస్తోంది. తన తల్లికి వచ్చింది చిన్న జ్వరమేనని భావిస్తున్న ఆ చిన్నారి.. ఒళ్లో పడుకోబెట్టుకుని సపర్యాలు చేస్తుండటం అక్కడున్నవారి మనసుల్ని మెలిపెడుతోంది.

ఆస్పత్రి దగ్గర దాతలు అందించే భోజనంలోనే నాలుగు ముద్దలు తల్లికి తినిపించి.. మరో రెండు ముద్దలు తాను తిని.. కాలం వెళ్లదీస్తోంది. తన తల్లికి అసలు ఏమైంది.. ఎందుకు ఆస్పత్రిలో చికిత్స అందిచట్లేదు.. ఆస్పత్రిలో చేర్చాలంటే ఏం చేయాలి అనే విషయాలేవి అర్థం చేసుకోలేని వయసులో.. వచ్చీపోయే వారిని చేయిచాచి సాయం కోసం అర్థిస్తున్న ఆ చిన్నారిని చూసి.. చలించిపోతున్నారు. ఇలా చలించిపోయిన ఓ వ్యక్తి ఆ చిన్నారిని తీసుకెళ్లి స్నానం చేయించి, ఉతికిన గౌను తొడిగి.. భోజనం పెట్టించి.. మళ్లీ ఆ తల్లి దగ్గరే వదిలేశాడు.

ఇంతటి దీనస్థితిలో ఉన్న ఆ తల్లీకూతుళ్లను చూసే ప్రతి ఒక్కరికి బాధ కలుగుతోంది కానీ.. ఒక్కరు కూడా వాళ్ల సమస్యేంటీ.. అని అడిగిన పాపం ముటగట్టుకోకపోవటం శోచనీయం. అలా అని జనాలందరిదీ తప్పని కాదు. ప్రస్తుతమున్న బిజీ లైఫ్‌లో తన ఆరోగ్యాన్నే సరిగ్గా పట్టించుకోని మనిషి.. ఇక అనారోగ్యంతో రోడ్డుపై పడిన వ్యక్తిని పట్టించుకుంటాడని ఎలా ఆశిస్తాం. కానీ.. ఆస్పత్రి సిబ్బంది అయినా.. ఆ మహిళ పరిస్థితి చూసి స్పందించాలిగా..! తమకు వైద్య పాఠాలు చెప్పే సమయంలో.. మనిషి ప్రాణం కాపాడటమే ప్రథమ కర్తవ్యమంటూ ప్రాథమిక సూత్రాలు నేర్పించే ఉంటారుగా.. ఆధార్ కార్డు ఉంటేనే ప్రాణాలు కాపాడాలి, వైద్యం చేయాలని ఆ ప్రాథమిక సూత్రాలను మార్చేశారా ఏంటీ..? రూల్స్ పేరుతో మనిషి ప్రాణం పోతున్నా పట్టించుకోకపోవటమేనా వైద్య సిబ్బంది కర్తవ్యం..!

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై బిగ్ అప్డేట్..

తెలంగాణలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రభుత్వం బిగ్ అప్డేట్ ఇచ్చింది. లబ్ధిదారుల జాబితాను ప్రకటించిన సర్కార్.. నిర్మాణంపై ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోవటంతో.. ప్రజల్లో కాస్త అయోమయం నెలకొంది. ఈ నేపథ్యంలో.. అధికారులకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో నిర్మాణం మొదలుపెట్టాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రజల్లో కాస్త అయోమయం నెలకొన్న నేపథ్యంలో.. బిగ్ అప్డేట్ వచ్చింది. అధికారులకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. నిర్మాణం విషయంలో మాత్రం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇండ్ల పనులు ఎప్పుడు మొదలుపెట్టాలి.. అసలు ప్రాసెస్ ఏంటీ.. నిధుల సంగతేంటీ..? అన్న విషయాలపై ప్రజలకు ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. మరోవైపు.. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉంది. దీంతో.. ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయన్న ఆనందం కంటే.. ఇప్పుడు ఏం చెయ్యాలన్న అయోమయమే ప్రజల్లో ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది.

**ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉంది. దీంతో.. ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయన్న ఆనందం కంటే.. ఇప్పుడు ఏం చెయ్యాలన్న అయోమయమే ప్రజల్లో ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది.గృహనిర్మాణ, రెవెన్యూ, ఐ అండ్ పీఆర్ అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారలకు భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు జారీ చేశారు.**

గృహనిర్మాణ, రెవెన్యూ, ఐ అండ్ పీఆర్ అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారలకు భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ముందుగా.. మహబూబ్ నగర్ నుంచే నిర్మాణాలు మొదలుపెట్టాలని సూచించారు. ఈ బడ్జెట్ సమీక్ష సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ప్రభుత్వం ఆదేశాలతో ఇక పనులు చకచకా జరగనున్నాయి.

మరోవైపు.. ప్రభుత్వ భూముల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు భట్టి విక్రమార్క సూచించారు. ప్రభుత్వ పథకాలను షార్ట్ ఫిల్మ్ రూపంలో క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు. అలాగే.. శాటిలైట్ టౌన్ షిప్ నిర్మాణాలపై గృహనిర్మాణ శాఖ దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ ఇండ్ల నిర్మాణంతో మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారం అవుతుందని భట్టి చెప్పుకొచ్చారు. డిజిటల్ భూ సర్వేకు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు.

## 'మీర్‌పేట' తరహాలో శవాన్ని ముక్కలుగా నరికి..



సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలంలోని మెగ్యానాయక్‌తండాలో ఓ లారీ డ్రైవర్ దారుణ హత్యకు గురయ్యాడు. పెళ్లయి అప్పటికే ఇద్దరు పిల్లలు ఉన్నా.. ప్రేమ పేరుతో ఓ బాలికను వేధింపులకు గురి చేస్తున్నాడని ఆమె తండ్రే బండరాయితో మోది హత్య చేశాడు. అనంతరం శవాన్ని పెట్రోల్ పోసి తగులబెట్టాడు. అయినా పూర్తిగా కాలకపోటవంతో ముక్కలుగా నరికి వేర్వేరు చోట్ల విసిరేశాడు.

హైదరాబాద్ మీర్‌పేట మాధవి హత్య కేసు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. కట్టుకున్న భర్తే భార్యను ముక్కలుగా నరికి శవాన్ని మాయం చేశాడు. అచ్చం అటువంటి ఘటనే సంగారెడ్డి జిల్లాలో చోటు చోటు చేసుకుంది. పెళ్లయి ఇద్దరు పిల్లలు ఉన్నా.. తన కుమార్తెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడన్న కోపంతో ఓ లారీ డ్రైవర్‌ను తండ్రి కిరాతకంగా హత్య చేశాడు. అనంతరం శవాన్ని ముక్కలుగా చేసి వేర్వేరు ప్రాంతాల్లో విసిరేశాడు.

వివరాల్లోకి వెళితే.. నిజాంపేట్ మండలం నాగధర్‌రాంచెందర్ తండాకు చెందిన ఆంగోత్ దశరథ్(26) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సంగారెడ్డిలోని ఓ షుగర్ ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మూడ్రోజుల క్రితం బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. అయితే దశరథ్ ఇంటికి రాకపోవటం, ఫ్యాక్టరీకి కూడా వెళ్లకపోవటంతో భార్య తెలిసినవాళ్లను ఆరా తీసింది. ఫోన్ చేసినా స్పందించకపోవటంతో సంగారెడ్డి రూరల్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. రెండ్రోజుల క్రితం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసారు. అతడి ఆచూకీ కోసం వెతుకుతుండగానే.. శనివారం నిజాంపేట్ మండలంలోని మెగ్యానాయక్‌తండాకు చెందిన గోపాల్ అనే వ్యక్తి తానే దశరథ్‌ను హత్య చేశానని నారాయణఖేడ్ స్టేషన్‌లో పోలీసుల ఎదుట లొంగిపోయాడు.

గోపాల్ కుమార్తెను ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తుండటంతో హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దశరథ్‌కు తన కుమార్తెతోనే ఫోన్ చేయించి ట్రాప్ చేసినట్లు తెలిపాడు. దశరథ్ మెగ్యానాయక్ తండా వద్దకు రాగానే.. అతడితో నిందితుడు గొడవకు దిగాడు. పెళ్లయి అప్పటికే ఇద్దరు పిల్లలు ఉన్న వాడివి.. నా కుమార్తెను ఎందుకు ప్రేమిస్తున్నావు? అంటూ నిలదీశాడు. ఆమె జీవితాన్ని ఎందుకు నాశనం చేస్తున్నావని అని గొడవపడ్డాడు. ఈ క్రమంలో కోపంతో దశరథ్‌ను బండరాయితో కొట్టి చంపాడు. అనంతరం శవాన్ని పెట్రోల్ పోసి తగులబెట్టాడు. మృతదేహం పూర్తిగా కాలకపోటవంతో ముక్కలు ముక్కలుగా నరికాడు. ఆ తర్వాత ముక్కలను వేర్వేరు ప్రాంతాల్లో విసిరేశాడు. శనివారం రాత్రి నిందితుడిని విచారించిన పోలీసులు.. సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసారు. మెగ్యానాయక్ తండా శివారులోని అటవీ ప్రాంతంలో మృతదేహాన్ని కాల్చిపడేసిన చోటుకు గోపాల్‌ను తీసుకెళ్లారు. మృతదేహం భాగాలను గుర్తించి శవపరీక్ష అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసును పూర్తి స్థాయిలో విచారించిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

## తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడు



తెలంగాణ బీజేపీకి త్వరలోనే కొత్త అధ్యక్షుడు రాబోతున్నాడంటూ.. కమల శ్రేణులకు కిక్కిచ్చే ప్రకటన చేశారు కేంద్ర మంత్రి, ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే.. తెలంగాణ బీజేపీకి నూతన అధ్యక్షుడు రాబోతున్నారంటూ కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. వరంగల్‌లో పర్యటించిన కిషన్ రెడ్డి.. రేవంత్ రెడ్డి సర్కార్ మీద, కులగణన సర్వే మీద సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కౌంటర్ ఇచ్చారు.

తెలంగాణ రాజకీయాల్లో రోజుకో కీలక పరిణామం చోటుచేసుకుంటోంది. ఇటీవల రాష్ట్రంలో నడుస్తోన్న రాజకీయాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జోరుగా నడుస్తుండగా.. కులగణన చేసి బీసీలకు న్యాయం చేస్తున్నామంటూ కాంగ్రెస్ పార్టీ చెప్తుంటే, తప్పుల తడకతో జనాలను మోసం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ ఆరోపిస్తూ.. ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. ఈ నేపథ్యంలోనే.. బీజేపీ పార్టీ కూడా తమ గళాన్ని గట్టిగా వినిపిస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు గట్టిగానే ప్రయత్నిస్తోంది. ఇటీవల.. ప్రధాని మోదీ కులానికి సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తమదైన శైలిలో ఖండిస్తూ.. కమల దళం అందరి దృష్టిని తమవైపు తిప్పుకుంటోంది. తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడి నియామకం గురించి కీలక ప్రకటన చేసి మరింత ఆసక్తి పెంచారు.. కేంద్ర మంత్రి, ప్రభుత్వం తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి. ఆదివారం (ఫిబ్రవరి 16న) రోజున వరంగల్‌లో పర్యటించిన కిషన్ రెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనపై, మోదీపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఏ ఒక్క బీసీ సంఘం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వేతో ఏకీభవించట్లేదని కిషన్ రెడ్డి ఆరోపించారు.

బీసీ రిజర్వేషన్లకు బీజేపీ మద్దతునిస్తుందని తెలిపిన కిషన్ రెడ్డి.. రాష్ట్రంలో సర్వే పూర్తయి, బీసీ సంఘాలు సమర్థిస్తే కేంద్రాన్ని ఒప్పించి ఆమోదింపజేస్తామని కీలక ప్రకటన చేశారు. రాహుల్ గాంధీ కులం గురించి సర్వే చేయాల్సిన అవసరం లేదని.. ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతోనే సర్వేలు చేయాలని కాంగ్రెస్ నేతలకు కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఈ క్రమంలోనే.. తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడి గురించి కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడు రాబోతున్నారని కిషన్ రెడ్డి ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీజేపీకి నూతన రాష్ట్ర అధ్యక్షుడు వస్తాడని స్పష్టం చేశారు. బిజీ షెడ్యూల్ వల్ల రాష్ట్ర అధ్యక్షుడి నియామకం ఆలస్యమవుతోందని కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు.

మరోవైపు.. బీఆర్ఎస్ పార్టీతో కలవాల్సిన అవసరం తమకు లేదని క్లారిటీ ఇచ్చారు కిషన్ రెడ్డి. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అభ్యర్థులను నిలబెట్టేందుకు భయపడుతున్నాయని విమర్శించారు. ఆ రెండు పార్టీల మధ్య అంతర్గత సంబంధం ఉందని కీలక ఆరోపణలు చేశారు. ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ కుటుంబం దోపిడీ చేసిందని రేవంత్ రెడ్డి ఆరోపణలు చేశారని.. ఇప్పుడు ఆయన కూడా అదేబాటలో నడుస్తున్నారని ఆరోపించారు. అందినకాడికి అప్పులు చేసి, రాష్ట్రాన్ని దివాళా తీసే పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. భూములు అమ్మడం, సొమ్ము చేసుకోవడమే లక్ష్యంగా రేవంత్ సర్కార్ పనిచేస్తోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

వనరులు సమకూర్చుకునే అంశంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి స్పష్టమైన ప్రణాళిక లేదని విమర్శించారు కిషన్ రెడ్డి. ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు రోడ్ మ్యాప్ కూడా లేదన్నారు. గుడ్డెద్దు వెళ్లి చేనులో పడ్డట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉందన్నారు. ఘాటుగానో, ఆవేశంగానో మాట్లాడితే ప్రజలు ఎక్కువ రోజులు భరించరని కిషన్ రెడ్డి తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు.

## చనిపోయినా వారి కళ్లు ప్రపంచాన్ని చూస్తాయ్..!

హనుమకొండ జిల్లా ముచ్చర్ల గ్రామంలో అందరూ చిరంజీవులే.. అనారోగ్యంతోనో, వృద్ధాప్యంతోనో ఎలా మరణించినా.. గంటల వ్యవధిలోనే మరో విధంగా బతికేస్తారు. అందమైన రంగుల ప్రపంచాన్ని చూడటంతో పాటు.. ప్రకృతిని ఆస్వాదిస్తారు. అదెలా అని ఆలోచిస్తున్నారా..! అందుకు ఒకే ఒక్క కారణం నేత్రదానం. చనిపోయిన తమవారి కళ్లను దానం చేసి మరొకరికి కంటి వెలుగై నిలుస్తున్నారు. మనిషై పుట్టాక కాసింత సామాజిక స్పృహ కలిగి ఉండాలని చాటి చెబుతున్నారు. దీపం తాను ఆరిపోతూ చుట్టూ చీకట్లో ఉన్నవారికి వెలుగులు పంచుతుంది. అవయవ దానం చేసేవారు కూడా అంతే.

తాము చనిపోయినా.. అవయవదానంతో పలువురికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తారు. మరణించిన తర్వాత జీవించేందుకు ఉన్న అత్యుత్తమ మార్గం ఒక్క అవయవదానం మాత్రమే. చనిపోయిన వారి అవయవాలను అవసరమైన వారికి అందించగలిగితే.. ఎన్నో కుటుంబాల్లో కొత్త వెలుగులు వస్తాయి. ఈ మాటల్ని హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ముచ్చర్ల గ్రామ ప్రజలు స్ఫూర్తి మంత్రంగా తీసుకున్నారు. ఆ గ్రామంలో ఎవరూ మరణించినా.. నేత్రదానంతో ప్రపంచాన్ని తిరిగి చూడగలుగుతున్నారు. సమాజంలో నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ముచ్చెర్ల గ్రామం జిల్లా కేంద్రం నుంచి 15 కి.మీ దూరంలో ఉంటుంది. ఆ గ్రామ మొత్తం జనాభా 500. అయితే ఆ గ్రామ ప్రజలందరూ సామాజిక స్పృహ కలిగినవారే. తాము చనిపోయినా.. మరొకరి జీవితంలో వెలుగులు నింపాలని మరణానంతరం తమ కళ్లను దానం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మానవతా హృదయంతో సాధ్యమైనన్ని జీవితాలలో చీకటిని పారదోలే ప్రయత్నం చేస్తున్నారు.

గత కొన్నేళ్లుగా గ్రామానికి చెందిన దాదాపు 70 మంది ఇప్పటికే తమ కళ్లను దానం చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ఈ నిర్ణయం అవయవదానం పొందిన వారికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తే.. మరణం తర్వాత కూడా ఒకరికి జీవితం ఇవ్వొచ్చుననే ఆలోచనను సమాజంలో రేకెత్తిస్తోంది. గ్రామానికి చెందిన మండల రవీందర్ ఈ మంచి పనికి తొలి అడుగు వేశారు. నీటి పారుదల శాఖలో డీఈగా పనిచేస్తున్న రవీందర్.. పదేండ్ల క్రితం తన తల్లిని కోల్పోయారు. ఆమె రెండు కండ్లనూ అవసరమైన వారికి దానం చేయడం ద్వారా.. తల్లి జ్ఞాపకాలను పదిలం చేసుకోవచ్చునని అనుకున్నారు. ఆ తర్వాత 2019లో తన తండ్రి కళ్లను కూడా దానం చేశారు. అక్కడితో ఆగిపోకుండా అవయవదానంపై.. ప్రత్యేకించి నేత్రదానంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. రవీందర్‌తో కలిసి నడవడానికి గ్రామస్థులు సిద్ధపడ్డారు. ఆయన సూచన మేరకు నేత్రదానం చేసేందుకు ముందుకొచ్చారు.

ఇప్పటి వరకు గ్రామానికి చెందిన 70 మంది తమ నేత్రాలను దానం చేశారు. ముచ్చర్ల గ్రామం స్ఫూర్తితో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన దాదాపు 20 మంది తమ కళ్లను దానం చేశారు. ఈ ప్రాంతంలో ఎవరు చనిపోయినా.. వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలోని నేత్రనిధి సభ్యులకు సమాచారం అందిస్తారు. వారు వచ్చి నేత్రాలను సేకరించి నేత్రనిధికి పంపుతారు.

ఎవరైనా వ్యక్తి చనిపోయిన ఆరు నుంచి ఎనిమిది గంటల్లోపు కళ్లలోని కార్నియాను సేకరించాల్సి ఉంటుంది. అలా సేకరించిన కార్నియాను హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి హాస్పిటల్ తరలిస్తారు. అక్కడ అవసరమైన వారికి వాటిని అమర్చుతారు. ఇలా చూపులేని వారికి చూపును ప్రసాదించి.. తమ వారు చనిపోయినా ప్రపంచాన్ని చూసేలా చేస్తున్నా రు ముచ్చర్ల గ్రామస్తులు. దేశవ్యాప్తం గా లక్షలాది మంది కార్నియా దెబ్బతిని చూపు కోల్పోతున్నారని.. అలాంటివారికి మళ్లీ చూపు తెప్పించి, లోకాన్ని చూపించడంలో ఎంతో సంతృప్తి ఉందని అంటున్నారు. నేత్రదానంతో తమకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్న ముచ్చర్ల గ్రామం ఇటీవల గవర్నర్ చేతుల మీదుగా 'ఎక్సలెన్స్ ఇన్ ఐ డొనేషన్' అవార్డును అందుకుంది.


## 60 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి..

రాష్ట్రంలో విలువైన భూములపై కన్నేస్తున్న కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాటిని చెరబడుతున్నారు. తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 20 వేల ఎకరాల చెరువు భూములు కబ్జా అయినట్లు లెక్క తేలింది. భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్న హైదరాబాద్, రంగారెడ్డి వంటి జిల్లాల్లో అయితే కబ్జారాయుళ్లు రెచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో సర్కార్ అప్రమత్తమైంది. ప్రభుత్వ భూముల రక్షణకు సిద్ధమైంది. తాజాగా.. రంగారెడ్డి జిల్లా యంత్రాంగం రూ. 60 వేల కోట్ల విలువైన దాదాపు 1,200 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించడానికి చర్యలు తీసుకుంది, హైదరాబాద్ హాఫీజ్‌పేట, మాదాపూర్, కొండాపూర్ వంటి ఏరియాల్లో కొన్ని ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు భూ యాజమాన్య హక్కులు సృష్టించి ప్రభుత్వ భూములకు ఎసరుపెడుతున్నారు. అనధికారంగా రిజిస్ట్రేషన్లు చేసి అమాయకులకు అంటగడుతున్నారు. సర్కార్ భూమల రక్షణ కోసం తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు తాజాగా.. వివాదాస్పద భూముల రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల విభాగానికి సవరించిన భూమి నిషేధిత జాబితాను పంపారు. ఆ భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ రిజిస్ట్రేషన్ చేయకూడని తెలిపారు. ఈ భూముల రిజిస్ట్రేషన్‌ను నిరోధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశించినట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు శేరిలింగంపల్లి, గండిపేట, రాజేంద్రనగర్ మండలాల్లో సర్వే నంబర్ల సవరించిన జాబితాను రిజిస్ట్రేషన్ విభాగానికి పంపినట్లు చెప్పా రు. ఈ భూముల రిజిస్ట్రేషన్‌ను నిషేధించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. అయితే గతంలో 2013, 2016లోనూ అప్పటి కలెక్టర్ రిజిస్ట్రేషన్ విభాగానికి ఇలాంటి నోటిఫికే షన్‌లను పంపారు, విధానపరమైన లోపాల కారణం గా.. రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ నేపథ్యంలో ఈసారి కఠనంగా వ్యవహరించాలని సర్కార్ భావిస్తోంది. అయితే ఈ నిషేధిత జాబితా భూముల్లోనూ కొన్ని చిక్కు ముడులు ఉన్నట్లు తెలుస్తోంది. హాఫీజ్‌పేటలో ఇటీవల ఒక ప్రైవేట్ సంస్థ భూములు ఉన్న సర్వే నంబర్‌ను నిషేధ జాబితా నుండి తొలగించారు. దీంతో ఆ రిజిస్ట్రేషన్‌కు అవకాశం దొరికింది. తాజాగా ప్రభుత్వం మరోసారి అదే భూమిపై ఆంక్షలు విధించింది, దీనిపై సదరు సంస్థల యాజమాన్యాలు అసహనం వ్యక్తం చేస్తుతున్నాయి. క్లియరెన్స్ తెచ్చుకున్నా.. మళ్లీ నిషేదిత జాబితాలో చేర్చారంటూ సదరు సంస్థలు కోర్టుకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి.

## హైదరాబాద్ మెట్రో రెండో దశలో కొత్త లేఅవుట్లు..

రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైదరాబాద్ మెట్రో రెండో దశ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. అయితే.. ఈ మెట్రో రెండో దశలో సరికొత్త టెక్నాలజీని ఆవిష్కరించేందుకు సర్కార్ సిద్ధమవుతోంది. ఆయా మార్గాల్లో అండర్ గ్రౌండ్ కారిడార్లను నిర్మించేందుకు హైదరాబాద్ మెట్రో కొత్త లేఅవుట్లను సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు హైదరాబాద్ మెట్రో సారథ్యంలో సాంకేతిక నిపుణులు, అధికారులు కొత్త మెట్రో మార్గాలను రూపొందించేందుకు ఇప్పటికే కసరత్తు కూడా ప్రారంభించారు. 23 కిలోమీటర్ల మేర నిర్మించే ప్యారడైజ్–మేడ్చల్ కారిడార్, 22 కిలోమీటర్ల జేబీఎస్– శామీర్‌పేట్ ప్రతిపాదిత కారిడార్ అలైన్‌మెంట్లకు సంబంధించి అధికారులు ఇప్పటికే కసరత్తు పూర్తి చేశారు. ఇక.. జేబీఎస్ నుంచి మేడ్చల్, జేబీఎస్ నుంచి శామీర్ పేట్ మెట్రో కారిడార్లకు డీపీఆర్‌ల తయారీకై అవసరమైన వివిధ రకాల సర్వే పనులు జోరుగా సాగుతున్నాయని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

డీపీఆర్‌ల తయారీకి ముఖ్యంగా ట్రాఫిక్ సర్వే, భూసామర్థ్య పరీక్షలు, పర్యావరణ ప్రభావ అధ్యయనం లాంటి 3 రకాల అధ్యయనాలు అవసరమని మెట్రో అధికారులు గుర్తించారు. ట్రాఫిక్ సర్వేకి సంబంధించిన అధ్యయనంలో ఈ కారిడార్లలో ప్రస్తుతం జరుగుతున్న రోజువారీ ప్రయాణాల సంఖ్య, భవిష్యత్తులో రోజువారీ ప్రయాణాల అంచనాలు, జంక్షన్ల వద్ద ప్రయాణికులు తీసుకునే మలుపులు, పాదచారుల సంఖ్య, వాహన ప్రయాణాలకు పట్టే సమయం, వాహన ప్రయాణాల్లో ఎంత శాతం మెట్రో రైలుకు మారే అవకాశం, వివిధ మెట్రో స్టేషన్లు ఏర్పాటయ్యే ప్రదేశాల ప్రయాణ సాంద్రత వంటి అనేక అంశాలు మెట్రో అధికారులు పరిశీలిస్తున్నారు.పర్యావరణ ప్రభావ అధ్యయనంలో ప్రస్తుతం ఈ మార్గాల్లో ఉన్న గాలి పరిశుభ్రత, గాలిలో ఉన్న దూళికణాల శాతం, కాలుష్య కారకాల నిర్ధారణ, శబ్ద కాలుష్యం, నీటి వనరులు, వృక్ష, జంతుజీవాల జీవ వైవిధ్యం, జీవనాధారభ్రుతులపై ప్రాజెక్టు చూపే ప్రభావం వంటి అంశాలు పరిశీలన చేయవల్సి ఉంటుందని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. భూసామర్థ్య పరీక్షల్లో భాగంగా ఈ మార్గాల్లో ఉండే మట్టి, రాతి పొరల నమూనాలు, వివిధ నిర్మాణాలకు కావాల్సిన భూ సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. భూగర్భంలో నిక్షిప్తమైన నీటి లెవెల్స్ అంచనాలు, భూకం పాలు ఏర్పడే అవకాశాలు వంటి విషయాలు క్షుణ్ణంగా అధ్యయనంచేసి మెట్రో స్తంభాలు, స్టేషన్లు ఎంత బలంగా డిజైన్ చేయాలో నిర్ణయిస్తారు.



# తిరుమల నడకదారిలో వెళ్లేవారికి కీలక సూచనలు

శ్రీవారి భక్తులకు టీటీడీ కీలక సూచనలు చేసింది. తిరుమల నడకదారిలో కొండపైకి వచ్చే భక్తులు జాగ్రత్తగా రావాలని అప్రమత్తం చేసింది. ఇటీవలి కాలంలో తిరుమల నడకమార్గంలో చిరుతల సంచారం పెరిగిపోయిన నేపథ్యంలో.. భక్తులు తగిన చర్యలు తీసుకోవాలని హితవు పలికింది. ఈ క్రమంలోనే తిరుమల నడకమార్గంలో భక్తుల రాకపోకలపై టీటీడీ అధికారులు పలు ఆంక్షలు విధించారు.

గత కొన్నిరోజులుగా తిరుపతి నుంచి తిరుమలకు నడకమార్గంలో.. తరచూ చిరుతలు కనిపించడంతో శ్రీవారి భక్తులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. గతంలో ఇలాగే చిరుతలు.. నడక మార్గంలో పలువురు భక్తులపై దాడి చేసిన నేపథ్యంలో.. ప్రస్తుతం చిరుత సంచరిస్తోందనే వార్తలతో మరింత భయపడుతున్నారు. ఈ క్రమంలోనే భక్తుల రక్షణ కోసం తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు పటిష్ఠ భద్రతా చర్యలు చేపడుతున్నారు. నడకమార్గంలో గస్తీని టీటీడీ విజిలెన్స్ సిబ్బంది మరింత ముమ్మరంగా చేపడుతున్నారు. అదే సమయంలో నడకమార్గంలో వచ్చే భక్తులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకుని.. కొండపైకి సురక్షితంగా చేరుకోవాలని సూచిస్తున్నారు. ఇక అలిపిరి నుంచి తిరుమలకు నడక మార్గంలో వెళ్లే భక్తులను తెల్లవారుజామున 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గతంలో లాగే యథావిధిగా అనుమతిస్తున్నారు.

అయితే ఆ తర్వాత భక్తులను ఒంటరిగా కాకుండా గుంపులు గుంపులుగా వదులుతున్నారు. ఒక్కో గుంపులో 70 నుంచి 100 మంది భక్తులు ఉండేలా విజిలెన్స్ సిబ్బంది చూస్తున్నారు. ఇక 12 ఏళ్ల వయసు లోపు ఉన్న చిన్నారులను మధ్యాహ్నం నుంచి అనుమతించడం లేదని టీటీడీ అధికారులు స్పష్టం చేశారు. ఇక రాత్రి 9.30 గంటల తర్వాత అలిపిరి నడక మార్గాన్ని మూసివేస్తున్నట్లు తెలిపారు.

ఇక ఇటీవలె తిరుమల అలిపిరి నడకమార్గంలో చిరుత సంచారం తీవ్ర కలకలం రేపింది. ఈనెల 13వ తేదీన 7వ మలుపు వద్ద చిరుత కనిపించడంతో నడకదారి భక్తులు భయంతో పరుగులు తీశారు. ఇక ఈ సమాచారాన్ని టీటీడీ, అధికారులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా.. వారు వెంటనే రంగంలోకి దిగి.. సంఘటనా స్థలంలో చిరుత ఆనవాళ్లను గుర్తించే పనిలో పడ్డారు. మరోవైపు చిరుత సంచారం పట్ల భక్తులను అప్రమత్తం చేసిన టీటీడీ అధికారులు.. చీకటి సమయాల్లో ఒంటరిగా తిరగవద్దని సూచించారు. ఎటు వెళ్లినా గుంపులుగా వెళ్లాలని హితవు పలికారు. టీటీడీ అధికారులు ఇచ్చిన ధైర్యంతో భక్తులు తిరుమల కొండకు ఎక్కుతున్నారు.

# ఆర్ధరాత్రి వేళ కారులో కేకలు..

బాకీ పడిన జీతం డబ్బులు ఇస్తామని చెప్పి యువకుణ్ని కిడ్నాప్ చేసి చిత్రహింసలు పెట్టిన ఘటన గుంటూరు జిల్లా తెనాలిలో జరిగింది. బాధితుడి వివరాల ప్రకారం తెనాలికి చెందిన మణిదీప్ హైదరాబాద్‌లో వ్యాపారం చేసేవాడు. అతని వద్ద పెద్దాపురానికి చెందిన సతీష్ కొంతకాలం పనిచేశాడు. అయితే సతీష్‌కు రెండు నెలల జీతం చెల్లించాల్సి ఉంది. దీని కోసం సతీష్ పదే పదే అడుగుతూ ఉండటంతో మణిదీప్ డబ్బులు ఇస్తానని విజయవాడకు రమ్మన్నాడు. విజయవాడ చేరుకున్న తర్వాత మరికొందరి సాయంతో సతీష్‌ను కిడ్నాప్ చేసి చిత్రహింసలు పెట్టాడు. అయితే అదృష్టం బాగుండి బయటపడిన సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుంటూరు జిల్లా తెనాలిలో యువకుడి కిడ్నాప్ వ్యవహారం కలకలం రేపింది. బాధితుడు చెప్తున్న వివరాల ప్రకారం.. తెనాలిలోని సుల్తానాబాద్‌కు చెందిన మణిదీప్ హైదరాబాద్‌లో వ్యాపారం చేసేవాడు. ఆ సమయంలో మణిదీప్ వద్ద కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన సతీష్ అనే యువకుడు పనిచేశాడు. అయితే పనిచేసినందుకు గానూ సతీష్‌కు మణిదీప్ రెండు నెలల జీతం చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బుల కోసం సతీష్.. మణిదీప్‌కు పలుసార్లు ఫోన్ కూడా చేశాడు. అయితే తర్వాత చూద్దాం అంటూ కాలం గడిపిన మణిదీప్.. చివరకు నీ డబ్బులు నీకు ఇస్తానంటూ విజయవాడకు రమ్మన్నాడు. దీంతో నిజంగానే డబ్బులు ఇస్తాడనే ఆశతో సతీష్ పెద్దాపురం నుంచి బయల్దేరి శు క్రవారం సాయంత్రానికి విజయవాడకు చేరుకున్నాడు.

అయితే సతీష్‌ను డబ్బులిస్తానని రమ్మన్నాడే కానీ.. మణిదీప్ మదిలో మరో ఆలోచన ఉంది. సతీష్ విజయవాడ చేరుకున్నాడని తెలియగానే తన మదిలోని ప్లాన్ అమలు చేయడం ప్రారంభించాడు మణిదీప్. సతీష్ విజయవాడ వచ్చిన తర్వాత మణిదీప్, మరో నలుగురి సాయంతో అతణ్ని కిడ్నాప్ చేశారు. సతీష్‌ను కారులో బలవంతంగా ఎక్కించుకుని తెనాలిలోని సుల్తానాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఒక ఇంట్లో సతీష్‌ను బంధించారు. కారులో వెళ్తున్న సమయంలో సతీష్ మీద దాడి చేసిన మణిదీప్, అతని అనుచరులు.. గదిలో బంధించిన తర్వాత అతనికి కరెంట్ షాక్ ఇచ్చారు. ఆ తర్వాత అర్ధరాత్రి సమయంలో సతీష్‌ను కారులో ఎక్కించుకుని బయల్దేరారు.

అయితే వీరు ప్రయాణిస్తున్న కారు తెనాలి-గుంటూరు వంతెనపైకి రాగానే.. వీరికి ఎదురుగా పోలీస్ వాహనం వచ్చింది. దీంతో పోలీసు జీప్ చూసిన బాధితుడు సతీష్.. కారులో నుంచి గట్టిగా కేకలు వేశాడు. దీంతో పోలీసులు కారును ఆపారు. ఆ వెంటనే కారులో ఉన్న సతీష్ అందులో నుంచి బయటకు దూకి పోలీసులకు తనను కిడ్నాప్ చేసి చిత్రహింసలు పెడుతున్న విషయం వివరించారు. అయితే పోలీసులు కారు ఆపగానే అందులోని కొంతమంది పరారైనట్లు తెలిసింది. మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మొత్తంగా బాకీపడ్డ బకాయి చెల్లిస్తానంటూ గదిలో బంధించి చిత్రహింసలు పెట్టడం స్థానికంగా కలకలం రేపుతోంది.

# ఏప్రిల్‌లో వారి ఖాతాల్లోకి రూ.20 వేలు..

**మత్స్యకారుల జీవన భృతి కోసం రూ.20 వేలు అందిస్తామని నిమ్మల రామానాయుడు తెలిపారు. ఏప్రిల్ నెల నుంచి మత్స్యకారులకు రూ.20 వేలు అందజేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు.**



ఆంధ్రప్రదేశ్‌లోని మత్స్యకారులకు ఏప్రిల్ నెల నుంచి మత్స్యకార భరోసా అందిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అలాగే మే నెలలో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామని క్లారిటీ ఇచ్చారు. విద్యార్థులకు కోసం వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే తల్లికి వందనం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి.. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే నియామకాలు పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

ఏపీలోని రైతులు, మత్స్యకారులకు ప్రభుత్వం త్వరలోనే శుభవార్త వినిపించనుంది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ విషయాన్ని వెల్లడించారు. ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న పేరాబత్తుల రాజశేఖర్ తరుఫున మంత్రి నిమ్మల రామనాయుడు ప్రచారం చేస్తున్నారు. ఆదివారం పాలకొల్లులో ప్రచారం నిర్వహించిన మంత్రి నిమ్మల.. రాజశేఖర్ విజయం కోసం అందరూ కృషి చేయాలని టీడీపీ శ్రేణులను కోరారు. మండలిలో ఎన్డీఏ కూటమికి మెజార్టీ ఇవ్వాలని గ్రాడ్యుయేట్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి నిమ్మల రామానాయుడు.. మత్స్యకార భరోసా, అన్నదాత సుఖీభవ పథకం అమలుపై కీలక వ్యాఖ్యలు చేశారు.

సముద్రంలో చేపల వేటను నిషేధించిన సమయంలో మత్స్యకారుల జీవన భృతి కోసం రూ.20 వేలు అందిస్తామని నిమ్మల రామానాయుడు తెలిపారు. ఏప్రిల్ నెల నుంచి మత్స్యకారులకు రూ.20 వేలు అందజేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. అలాగే మే నెలలో రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని టీడీపీ కూటమి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అలాగే జూన్ నెలలో విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే తల్లికి వందనం అమలు చేస్తామని మంత్రి రామానాయుడు తెలిపారు. తల్లికి వందనం పథకం కింద స్కూలుకు వెళ్లే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15000 చొప్పున అందిస్తామని కూటమి హామీ ఇచ్చింది.

మరోవైపు వచ్చే ఐదేళ్లలో ఏపీ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రభుత్వం ప్రాధాన్యమని.. అదే లక్ష్యంగా పనిచేస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అందులో భాగంగానే నారా చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీపై సంతకం చేశారని గుర్తుచేశారు మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డు వచ్చిందన్న మంత్రి.. ఎన్నికలు ముగియగానే డీఎస్సీ విడుదల చేస్తామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఉపాధ్యాయ పోస్టులకు నియామకాలు పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు.

# నో వెయిటింగ్.. సిగ్నలింగ్ వ్యవస్థలో కొత్త విధానం!



రైలు ప్రయాణికులకు శుభవార్త. రైళ్ల కోసం స్టేషన్లలో నిరీక్షించాల్సిన అవసరం లేకుండా, అలాగే స్టేషన్‌కు కిలోమీటర్ల దూరంలో రైళ్లోనే వెయిట్ చేయాల్సిన పనిలేకుండా ప్రయాణికుల సౌకర్యం కోసం రైల్వే కొత్త విధానం అమల్లోకి తేనుంది. ఈ విషయాన్ని గుంతకల్లు రైల్వే డీఆర్ఎం తెలిపారు. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని గుంతకల్లు - మొలగవల్లి స్టేషన్ల మధ్య ఆటోమేటిక్ సిగ్నలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది విజయవంతంగా అమలవుతోందని.. త్వరలోనే అంచెలవారీగా డివిజన్ మొత్తం దీనిని ఏర్పాటు చేస్తామని గుంతకల్లు రైల్వే డీఆర్ఎం తెలిపారు.

ఏదో అర్జంట్ పని పడుతుంది.. వేరే నగరానికి వెళ్లాల్సి వస్తుంది. దూరమేమో ఎక్కువగా ఉంటుంది. దీంతో హడావిడిగా ప్రయాణానికి సిద్ధమైపోతాం. దూర ప్రాంతం కావటంతో ఖర్చుపరంగా, సౌకర్యంగా ఉంటుందనే కారణంతో బస్సులు బదులు రైళ్లను ఎంచుకుంటాం. రైలు టికెట్ కొనుగోలు చేసో లేదా రిజర్వేషన్ చేసుకునో ఏవేవో తంటాలు పడి సీటు సంపాదిస్తాం. అన్నీ సర్దుకుని రైల్లో కూర్చుని ప్రయాణానికి సిద్ధమైపోతాం. రైలు వెళ్తూ ఉంటుంది.. అక్కడక్కడా ఆగుతూ.. కొన్ని చోట్ల వేగంగా, మరికొన్ని చోట్ల నెమ్మదిగా.. అలా సాగుతూ.. సాగుతూ.. మనం చేరాల్సిన గమ్యస్థానం దగ్గర్లోకి చేరుకుంటాం. ఇక అప్పుడు మొదలౌతుంది అసలు టెన్షన్..

మనం చేరాల్సిన రైల్వేస్టేషన్ మరికొన్ని కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అప్పటి వరకూ వేగంగా సాగిన మన రైలు ప్రయాణం అక్కడి నుంచి నెమ్మదిస్తుంది. సముద్రంలో నుంచి ఉవ్వెత్తున ఎగసి వచ్చిన అల.. తీరానికి సమీపించినప్పుడు నెమ్మదించిన మాదిరిగా మన రైలు కూడా.. నెమ్మదిగా కదలడం మొదలెడుతుంది. కొన్నిసార్లు ప్రధాన రైల్వేస్టేషన్‌కు కిలోమీటర్ల దూరంలోని చిన్న స్టేషన్లలో రైళ్లను ఆపివేస్తుంటారు. కారణంగా సిగ్నలింగ్. ప్రధాన రైల్వేస్టేషన్ నుంచి సిగ్నల్ రాక.. ఆ రైల్వేస్టేషన్‌కు కిలోమీటర్ల దూరంలోనే రైళ్లో వేచి చూడాల్సిన పరిస్థితి ఉంటుంది. అలాగే అదే రైలు ఎక్కాల్సిన వారు కూడా రైలెప్పుడొస్తుందో అంటూ ప్లాట్ ఫామ్ మీద నిరీక్షిస్తూ ఉంటారు. అయితే ఇకపై ఈ ఇబ్బంది తప్పనుంది.

సిగ్నల్ కోసం రైల్వేస్టేషన్‌కు కి.మీల దూరంలోనే రైళ్లోనే నిరీక్షిస్తూ ఉండాల్సిన పరిస్థితి పోతుందని గుంతకల్లు రైల్వే డివిజన్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా చెప్తున్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో కొత్త ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యవస్థను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తే ఇలా రైల్వేస్టేషన్‌కు కిలోమీటర్ల దూరంలోనే రైళ్లల్లో వేచి ఉండాల్సిన పరిస్థితి, అలాగే రైళ్ల కోసం రైల్వేస్టేషన్లలో నిరీక్షించాల్సిన అవసరం ఉండదని తెలిపారు. నూతన సిగ్నలింగ్ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు పుస్తకాలను శనివారం ఆవిష్కరించారు. మరోవైపు ప్రస్తుతం రైల్వేస్టేషన్ నుంచి ఓ రైలు బయల్దేరి పూర్తిగా స్టేషన్ దాటిన తరువాతనే మరో రైలు రావడానికి అనుమతి స్తారని గుంతకల్లు రైల్వే డీఆర్ఎం తెలిపారు. కొత్త సిగ్నల్ వ్యవస్థ ద్వారా ఒకదాని వెనుక ఒకటి అన్నట్లుగా రైళ్లను నడిపే అవకాశం ఉంటుందని వివరించారు. దీంతో రైలు ప్రయాణికులు గంటల తరబడి రైల్వే స్టేషన్లలో నిరీక్షించాల్సిన పరిస్థితి ఉండదన్నారు. ఈ ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను గుంతకల్లు డివిజన్‌లోని గుంతకల్లు - మొలగవల్లి స్టేషన్ల మధ్య ఏర్పాటుచేశారు.అంచెలవారీగా గుంతకల్లు రైల్వేడివిజన్ అంతటా ఈ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వే శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

# మంగళగిరిలో భారీ చోరీ..

గుంటూరు జిల్లాలో భారీ దొంగతనం చోటు చేసుకుంది. ఏకంగా 5 కిలోల బంగారు నగలను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుపోయారు. ఆ బంగారు ఆభరణాల విలువ రూ.4 కోట్లకుపైనే ఉంటుందని అంచనా వేస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఈ దొంగతనం ఘటనపై విచారణ చేపట్టారు. విజయవాడ నుంచి మంగళగిరికి వస్తుండగా.. అది గమనించిన దుండగులు.. సరైన సమయం చూసి చోరీ చేసినట్లు బాధితుడు పోలీసులకు చెప్పాడు. గుంటూరు జిల్లాలో కొందరు దుండగులు సినిమా రేంజ్‌లో భారీ చోరీకి పాల్పడ్డారు. భారీగా బంగారు నగలతో కూడిన బ్యాగుతో వెళ్తున్న వ్యక్తిని అడ్డగించారు. బైక్‌పై వచ్చిన దుండగులు.. ఆ వ్యక్తిని అడ్డుకుని బెదిరించారు. అనంతరం అతడి వద్ద ఉన్న బ్యాగుతో అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో ఆ వ్యక్తి చేసేదేమీ లేక పోలీసులను ఆశ్రయించాడు. తన వద్ద ఉన్న బంగారు నగల బ్యాగును కొందరు ఎత్తుకుపోయారని మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. ఆ బంగారు నగలు ఎత్తుకెళ్లిన దొంగలను పట్టుకునేందుకు ఆ ప్రాంతం మొత్తం గాలింపు చేపట్టారు. మంగళగిరి మండల కేంద్రంలో శనివారం రాత్రి ఈ భారీ చోరీ చోటు చేసుకుంది. దాదాపుగా 5 కిలోల బంగారు నగలు అపహరణకు గురి కావడం తీవ్ర కలకలం రేపుతోంది. విజయవాడ డీవీఆర్ జ్యువెలరీ షాప్ యజమాని రాము విజయవాడ నుంచి గుంటూరు జిల్లాలోని మంగళగిరికి శనివారం రాత్రి బయల్దేరాడు. అయితే మంగళగిరి మండలం ఆత్మకూరు అండర్ పాస్ వద్దకు రాగానే ఈ చోరీ జరిగింది. అంతకుముందు నుంచే రామును బైక్‌పై ఫాలో అయిన ఇద్దరు దుండగులు.. అతడిని బెదిరించారు. చంపేస్తామని బెదిరించిన ఆ దుండగులు.. రాము వద్ద ఉన్న బంగారు ఆభరణాల బ్యాగును తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో భయంతో వణికిపోయిన రాము.. హుటాహుటిన మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జరిగిన దొంగతనం గురించి వివరించి ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలోనే శనివారం అర్ధరాత్రి.. ఆ బంగారం దొంగలను పట్టుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. చోరీ జరిగిన ఆత్మకూర్ అండర్ పాస్ పరిసర ప్రాంతాలను ముమ్మరంగా గాలించారు. అయినా దొంగల జాడ తెలియకపోవడంతో కేసు నమోదు చేసుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు.. ఈ ఘటనపై విచారణ చేపట్టారు. అయితే తన వద్ద ఉన్న బ్యాగులో 4.900 కిలోల బంగారు ఆభరణాలు ఉన్నాయని.. డీవీఆర్ జ్యువెలరీ షాప్ ఓనర్ రాము ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.4 కోట్లకుపైనే ఉంటుందని పోలీసులకు వివరించాడు.

# తిరుమలలో ఇబ్బంది తప్పినట్టే..




శ్రీవారి భక్తులకు తీపి కబురు. శ్రీవారి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్న టీటీడీ.. ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. శ్రీవారి భక్తులు ఎండవేడిమికి, వర్షాలకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు శాశ్వత ప్రాతిపదికన షెడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. శ్రీవారి ఆలయ మాడవీధుల్లో శాశ్వత షెడ్ల ఏర్పాటు కోసం సాంకేతిక సర్వేను టీటీడీ ఇంజనీ రింగ్ సిబ్బంది శనివారం ప్రారంభించారు.

కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల వెంకటేశ్వర స్వామి నిత్యం వేలాది మంది భక్తులు దర్శించుకుంటూ ఉంటారు. సుదూర ప్రాంతాల నుంచి వెంకన్న దర్శనానికి తరలివస్తుంటారు. సాధారణ రోజుల్లో పోలిస్తే సెలవు రోజుల్లోనూ, పండుగ వేళ ఈ రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. దూర ప్రాంతాల నుంచి శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ ఎప్పటికప్పు డు చర్యలు చేపడుతూ ఉంటుంది. తాజాగా శ్రీవారి భక్తుల కోసం టీటీడీ మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

తిరుమల శ్రీవారి దర్శనానికి వేసవి కాలంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. స్కూళ్లు, కాలేజీ విద్యార్థులకు పరీక్షలు ముగిసి సెలవులు రావటంతో పాటుగా ఫలితాలు కూడా వెల్లడి అవుతూ ఉంటాయి. దీంతో తిరుమల శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు భారీగా తిరుమలకు వస్తుంటారు. దీంతో ఏప్రిల్, మే నెలల్లో తిరుమల కొండ భక్తుల రద్దీతో కిటకిటలాడుతూ ఉంటుంది. ఓ వైపు రద్దీ, మరోవైపు వేసవి తాపంతో భక్తులు ఇబ్బందులు పడుతుంటారు. భక్తులకు సాంత్వన చేకూర్చడానికి టీటీడీ మాడ వీధుల్లో కూల్ పెయింట్ వేయిస్తూ ఉంటుంది. అలాగే శ్రీవారి బ్రహ్మోత్సవాల వంటి వేడుకల సమయంలోనూ మాడ వీధుల్లో భక్తులు ఎండ వేడిమికి ఇబ్బంది పడకుండా టీటీడీ తాత్కాలిక జర్మన్ షెడ్లు, ఇతర షెడ్లను వేయిస్తూ ఉంటుంది. వీటి ఏర్పాటు కోసం భారీగా నిధులను ఖర్చు చేస్తూ ఉంటుంది.

తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మాడ వీధుల్లో జర్మన్ షెడ్లు, తాత్కాలిక షెడ్ల కోసం భారీగా నిధులు ఖర్చు చేయడానికి బదులుగా శాశ్వత ప్రాతిపదికన షెడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. అవసరమైన పుడు ఉపయోగించుకుని, అవసరం లేని సమయంలో ఆటోమే టిక్‌గా ముడుచుకునేలా ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. అందులో భాగంగానే ఆలయ మాడవీధుల్లో శాశ్వత షెడ్ల ఏర్పాటు కోసం సాంకేతిక సర్వే ప్రారంభించారు, శనివారం టీటీడీ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో ఆలయం ఎదుట, మాడవీధుల్లో సర్వే చేపట్టారు. ఇవి పూర్తి అయితే వేసవి కాలంతో పాటుగా, బ్రహ్మోత్సవాల వంటి వేడుకల సమయంలోనూ భక్తులకు ఉపయోగకరంగా, సౌకర్యవంతంగా, అనుకూలంగా ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

# శ్రీశైలం మల్లన్న భక్తులకు తీపికబురు..



మహాశివరాత్రికి శ్రీశైలం సర్వాంగ సుందరంగా సిద్ధమవుతోంది. మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు జరనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలను చూడటానికి భక్తులు భారీగా తరలి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భక్తుల కోసం శ్రీశైలం దేవస్థానం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఉచితంగా లడ్డూను అందించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. 50 గ్రాముల బరువుండే లడ్డూలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం 4 లక్షల లడ్డూలను సిద్ధం చేస్తున్నారు.

**శివ దీక్షలు చేపట్టి వచ్చే వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం సాంబారన్నం, పెరుగన్నం, రాత్రికి ఉప్మా వడ్డించేలా శ్రీశైలం దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. అలాగే కంపార్ట్‌మెంట్లలోని భక్తులకు అల్పాహార ప్రసాదంగా పులిహోర, పొంగలి, పెరుగన్నం, సాంబారన్నం,జీరా అన్నం, టమాటబాత్ వడ్డిస్తారు. మంచినీరు, చిన్న పిల్లలకు పాలు అందించేలా ఏర్పాట్లు చేశారు.**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీశైలం సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 19 నుంచి మార్చి ఒకటో తేదీ వరకూ శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు, అధికారులు తరలి రానున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటుగా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఈ నేపథ్యంలోనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శ్రీశైలం దేవస్థానం అన్నిరకాల ఏర్పాట్లు చేస్తోంది.

అందులో భాగంగా భక్తుల ఆకలి తీర్చేందుకు అన్న ప్రసాదం పంపిణీ చేయనుంది. అన్నపూర్ణ భవన్‌లోని హాల్-1, హాల్-2లలో శివ భక్తులకు, సాధారణ భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేయనున్నారు. మూడో నంబర్ హాలులో పోలీసులకు, నాలుగు, ఐదో నంబర్ హాళ్లల్లో కళాకారులు, వీఐపీలకు భోజనం ఏర్పాట్లు చేస్తున్నారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 వరకు అన్న ప్రసాదం పంపిణీ జరగనుంది. అలాగే సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ అన్న ప్రసాదం అందజేస్తారు.

భక్తులకు అందించే అన్న ప్రసాదంలో సాంబారన్నం, పెరుగన్నంతో పాటుగా ఒక స్వీటు ఉండనుంది. శివ దీక్షలు చేపట్టి వచ్చే వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం సాంబారన్నం, పెరుగన్నం, రాత్రికి ఉప్మా వడ్డించేలా శ్రీశైలం దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. అలాగే కంపార్ట్‌మెంట్లలోని భక్తులకు అల్పాహార ప్రసాదంగా పులిహోర, పొంగలి, పెరుగన్నం, సాంబారన్నం,జీరా అన్నం, టమాటబాత్ వడ్డిస్తారు. మంచినీరు, చిన్న పిల్లలకు పాలు అందించేలా ఏర్పాట్లు చేశారు. మరోవైపు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే ప్రతి భక్తుడికి ఉచితంగా ఒక లడ్డూ అందించాలని ఇటీవల ఏపీ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఆదేశం మేరకు శ్రీశైలం దేవస్థానం చర్యలు ప్రారంభించింది. ప్రతి భక్తుడికి 50 గ్రాముల బరువుండే లడ్డూను ఉచితంగా ఇవ్వనున్నారు. ఇందుకోసం మొత్తం 4 లక్షల లడ్డూలు తయారు చేస్తున్నారు. ఫిబ్రవరి 24 నుంచి 27వ తేదీ వరకు భక్తులకు ఉచితంగా లడ్డూలు అందజేస్తారు.

మరోవైపు లడ్డూ ప్రసాదాల తయారీని శనివారం ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలోని పోటులో లడ్డూల తయారీకి లాంఛనంగా శ్రీకారం చుట్టారు. బ్రహ్మోత్సవాల కోసం మొత్తం 35 లక్షల లడ్డూలను తయారు చేయనున్నారు. రోజుకు 2 లక్షల నుంచి 4 లక్షల లడ్డూలు తయారు చేయనున్నారు. 100 గ్రాముల లడ్డూ రూ.20 చొప్పున కౌంటర్ల ద్వారా విక్రయిస్తారు. లడ్డూ కౌంటర్ల వద్ద రద్దీని తగ్గించడానికి ప్రైవేట్ సత్రాల వద్ద కూడా లడ్డూ విక్రయాలు జరపాలని దేవస్థానం నిర్ణయించింది.

# అస్సాంలో అల్లు అర్జున్ ఫ్యామిలీ.. వెకేషన్‌లో సందడి



అల్లు అర్జున్ ప్రస్తుతం తన ఫ్యామిలీతో కలిసి చిల్ అవుతున్నాడు. ఫ్యామిలీ మొత్తాన్ని తీసుకుని అస్సోంలోని అటవీ అందాల్ని చూస్తున్నాడు. అక్కడి జాతీయ పార్కులో సంచరిస్తున్నాడు. మామూలుగా అయితే బన్నీ ఇంటర్నేషనల్‌గా వెకేషన్స్ వేస్తుంటాడు. ఫారిన్ కంట్రీస్‌కే వెళ్తుంటాడు. కానీ ఇప్పుడు ఉన్న కేసుల దృష్ట్యా దేశం దాటి బయటకు వెళ్లలేని పరిస్థితి. అందుకే ఇలా అస్సోంలో తిరిగేస్తున్నాడు.

అల్లు అర్జున్ ప్రస్తుతం పుష్ప 2 మేనియా నుంచి బయటకు వచ్చే ప్రయత్నం చేస్తున్నాడు. పుష్ప రాజ్ గెటప్‌ను తీసేశాడు. లుక్ మార్చేశాడు. బన్నీ చాలా రోజుల తరువాత కొత్తగా కనిపించాడు. ఇన్నేళ్లు ఫుల్లుగా గడ్డంతో కనిపించేవాడు. ఇప్పుడు చాలా యంగ్‌గా అనిపిస్తున్నాడు. ఇక బన్నీ పుష్ప 2 అంటూ రెండు, మూడేళ్లు ఫ్యామిలీకి అంతగా టైం ఇవ్వలేకపోయాడు. ఇక ఇప్పుడు కొత్త సినిమా ప్రారంభానికి కాస్త గ్యాప్ దొరికింది. ఈ టైంని ఫుల్లుగా ఫ్యామిలీకే కేటాయించాడు బన్నీ. ప్రస్తుతం బన్నీ ఫ్యామిలీ ఎంజాయ్ చేస్తోంది. అల్లు అర్జున్ మామూలుగా అయితే వెకేషన్ విదేశాలకు వెళ్తుంటాడు. కానీ బన్నీ మీద ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది. బెయిల్ మీద బయటకు వచ్చాడు. ఇప్పుడు విదేశాలకు వెళ్లాలంటే పర్మిషన్ రావడం కష్టం. అందుకే ఇలా ఇండియాలోని ప్రకృతిని ఆస్వాధిస్తున్నాడనిపిస్తోంది. అస్సాంలోని నేషనల్ పార్కులో బన్నీ ఫ్యామిలీ సందడి చేస్తోంది. నమేరి నేషనల్ పార్కులో ఉన్నట్టుగా అల్లు స్నేహా రెడ్డి లొకేషన్ పెట్టింది.

ప్రస్తుతం అర్హ, అయాన్, బన్నీ, స్నేహా రెడ్డి ఈ అస్సాం వెకేషన్‌ను బాగానే ఎంజాయ్ చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఇక త్రివిక్రమ్ ప్రాజెక్ట్ మీద ఇంత వరకు క్లారిటీ అయితే రాదు. త్రివిక్రమ్ ఇంకా కథను వండే పనిలోనే ఉన్నాడని సమాచారం. ఇంకా టైం తీసుకునేలా ఉన్నాడని బన్నీ మరో ప్రాజెక్ట్ మీదకు వెళ్తున్నాడని అంటున్నారు. అట్లీతో కథా చర్చలు కూడా పూర్తయ్యాయ్ అని, అట్లీతోనూ మూవీ వెంటనే ఉంటుందని అంటున్నారు. మరి త్రివిక్రమ్ బన్నీ ప్రాజెక్ట్ ఉంటుందా? కాస్త వాయిదా వేస్తారా? లేదంటే సమ్మర్‌లోపే స్టార్ట్ చేస్తారా? అన్నది చూడాలి. ఈ మూవీని సితారా బ్యానర్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. అప్పట్లో నాగవంశీ కొంచెం లీక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇంత వరకు ఇండియాలో టచ్ చేయని జానర్, పాయింట్‌తో త్రివిక్రమ్ వస్తున్నాడని హైప్ పెంచేశాడు. కానీ ఇంత వరకు కథ మాత్రం ముందుకు జరగడం లేదని టాక్.

# సాయిపల్లవికి ముద్దు పెట్టిన అభిమాని



తన అభినయంతో పాటుగా డ్యాన్సులతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. తనకంటూ సపరేట్ గా ఫాలోయింగ్ ఏర్పరచుకుంది. 'అమరన్' 'తండేల్' వంటి బ్యాక్ టూ బ్యాక్ బ్లాక్ బస్టర్స్ తో ఫుల్ ఖుషీ అవుతున్న పల్లవి.. ఇప్పుడు బాలీవుడ్ లో ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయింది. తాజాగా ఆమె చేతిని ఓ లేడీ ఫ్యాన్ కిస్ చేస్తున్న వీడియో ఇంటర్నెట్ లో వైరల్ అవుతోంది.

నేచురల్ బ్యూటీ సాయి పల్లవి క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. స్టార్ హీరోలతో ఈక్వల్ గా ఆమెకు ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. సుకుమార్ లాంటి అగ్ర దర్శకుడే స్వయంగా 'లేడీ పవర్ స్టార్' అనే ట్యాగ్ ఇచ్చారంటేనే, జనాల్లో ఆమెకున్న క్రేజ్ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. చేసింది తక్కువ సినిమాలే అయినా.. వాటితోనే ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసుకుంది. కేవలం పల్లవి కోసమే సినిమాకి వెళ్లే ఆడియన్స్ చాలామందే ఉన్నారు. అయితే ఇప్పుడు ఓ అభిమాని ఆమెకు 'బాషా' రేంజ్ లో ఎలివేషన్ ఇస్తూ క్రియేట్ చేసిన ఓ వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది.

చందూ మొండేటి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అక్కినేని నాగ చైతన్యకు జోడీగా కనిపించింది. బుజ్జి తల్లి అనే పాత్రలో అద్భుతమైన నటన కనబరిచింది. ఫిబ్రవరి 7వ తేదీన విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించింది. ఇక ఈ మూవీ ప్రమోషన్స్ లో భాగంగా నిర్వహించిన ఈవెంట్స్ లో సాయి పల్లవి సందడి చేసింది. రిలీజ్ కు ముందు తండేల్ జాతర ఈవెంట్ లో సాయి పల్లవి చెయ్యిని ఓ మహిళా అభిమాని ముద్దు పెట్టుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఓ అమ్మాయి 'తండేల్' ఈవెంట్ లో సాయి పల్లవికి షేక్ హ్యాండ్ ఇచ్చి, వెంటనే కిస్ చేసింది. 'బాషా' సినిమాలో ఆటో డ్రైవర్ మాణిక్యం ఇంటర్వెల్ లో మాణిక్ బాషాగా మారిన సమయంలో, తన అనుచరులు అంతా వచ్చి సూపర్ స్టార్ రజనీకాంత్ చేతిని ముద్దు పెట్టుకుంటారు. ఆ సీన్ తో ఇప్పుడు సాయి పల్లవి క్లిప్ ని కంపేర్ చేస్తూ, ఓ నెటిజన్ వీడియో పోస్ట్ చేసాడు. సినిమాల విషయానికొస్తే, సెలెక్టివ్ గా స్క్రిప్ట్స్ ఎంచుకుంటూ వస్తోన్న సాయి పల్లవి.. గత మూడేళ్ళలో నాలుగు చిత్రాల్లో నటించింది. 'గార్గి' వంటి విమెన్ సెంట్రిక్ మూవీతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. గతేడాది 'అమరన్' చిత్రంతో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకుంది. దీంతో 300 కోట్ల క్లబ్ హీరోయిన్ల లిస్టులో చేరిపోయింది.

# మరీ అంత ఇష్టమా?..




రామ్ చరణ్‌కి ఓ చెక్ షర్ట్ ఉంది. గత పదేళ్లుగా ఆ షర్ట్‌ను వాడిందే వాడుతున్నాడు. చాలా సందర్భాల్లో అదే షర్ట్ మీద రామ్ చరణ్ ఉన్న ఫోటోలు బయటకు వచ్చాయి. రీసెంట్ బుచ్చిబాబు సానాతో కూడా అదే షర్టులో కనిపించాడు.అసలు ఏంటన్నా.. ఆ షర్ట్ అంటే నీకు ఎందుకంత ప్రేమ అంటూ మెగా ఫ్యాన్స్ ఫన్నీగా కామెంట్లు చేస్తున్నారు. నచ్చితే బాయ్స్ ఇలానే రిపీట్ చేస్తుంటారని మీమ్స్ వేస్తున్నారు.

రామ్ చరణ్ ప్రస్తుతం నెట్టింట్లో బాగా ట్రెండ్ అవుతున్నాడు. ఈ క్రమంలో బుచ్చిబాబుకి రామ్ చరణ్ బర్త్ డే విషెస్ చెబుతూ ఓ ఫోటోను వదిలాడు. ఆ ఫోటోలని షర్ట్‌ని చూసిన వారంతా ఫన్నీగా కామెంట్లు పెడుతున్నారు. ఏంటన్నా.. నువ్వు కూడా మా మిడిల్ క్లాస్ అబ్బాయిల్లా ప్రవర్తిస్తున్నావ్.. ఎందుకు ఎప్పుడూ ఇదే షర్ట్ వేసుకుంటున్నావ్.. నీకు ఈ షర్ట్ అంటే అంత ఇష్టమా? అంటూ కామెంట్లు పెడుతున్నారు.

రామ్ చరణ్ చెక్ షర్ట్స్ మీద ఫన్నీగా మీమ్స్ క్రియేట్ చేస్తుంటారన్న సంగతి తెలిసిందే. 2016 నుంచి ఇదే షర్ట్‌ని మార్చి మార్చి వేసుకుంటున్నాడు. ఆర్ఆర్ఆర్ ప్రమోషన్స్‌లోనూ ఇదే షర్ట్‌ని వేసుకున్నాడు. ఎన్నికల టైంలో పవన్ కళ్యాణ్ వద్దకు వెళ్లినప్పుడు పిఠాపురంలోనూ ఇదే షర్ట్‌తో కనిపించాడు. ఇక ఇప్పుడు కూడా ఇదే షర్ట్‌తో కనిపించాడు. దీంతో ఫ్యాన్స్ ఫన్నీగా కామెంట్లు పెడుతున్నారు. బాయ్స్‌కి ఓ షర్ట్ నచ్చితే.. చినిగే వరకు వేసుకుంటూనే ఉంటారు అంటూ ఫన్నీగా రియాక్ట్ అవుతున్నారు. ఇదేదో చాలా కలిసి వచ్చిన షర్టులా ఉంది.. సెంటిమెంట్ అనుకుంటా.. అందుకే ఇన్ని సార్లు వాడేస్తున్నాడని కామెంట్లు పెడుతున్నారు. ప్రస్తుతం రామ్ చరణ్ చిన్న వెకేషన్‌లో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఫిబ్రవరి మొదటి రెండు వారాలు అయితే షూటింగ్ అంటూ ఫుల్ బిజీగా ఉన్నాడు. జ్వరం వచ్చినా కూడా రామ్ చరణ్ షూటింగ్‌కు అంతరాయం కలిగించలేదని సమాచారం.

# ఓవైపు గీతా, మరోవైపు సితార..



కోలీవుడ్ బ్రదర్స్ సూర్య, కార్తీలకు టాలీవుడ్ లో మంచి ఫాలోయింగ్ ఉంది. 'గజిని', 'యముడు' సిరీస్, 'సూర్య సన్నాఫ్ కృష్ణన్' 'ఆకాశం నీ హద్దురా' వంటి చిత్రాలతో సూర్య తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. తెలుగులో స్ట్రెయిట్ సినిమా చేయాలనే తన మనసులోని కోరికను బయట పెట్టాడు. మంచి కథ దొరికితే తెలుగులో ఎంట్రీ ఇస్తానని చాలా సార్లు చెప్పాడు. 'కంగువ' ప్రమోషన్స్ లోనూ ఈ విషయాన్ని వెల్లడించారు. అయితే ఇన్నాళ్లకు సూర్య తెలుగులో రెండు ప్రాజెక్ట్స్ కమిట్ అయినట్లుగా టాక్ వినిపిస్తోంది.

తెలుగులో మంచి క్రేజ్ ఉన్న తమిళ హీరోలలో సూర్య ఒకడు. డబ్బింగ్ చిత్రాలతో తనకంటూ సపరేట్ మార్కెట్ క్రియేట్ చేసుకున్నారు. ఆయన్ను 'టాలీవుడ్ దత్తపుత్రుడు' అని పిలుచుకుంటుంటారు. అందుకే స్ట్రెయిట్ తెలుగు మూవీ చేయడానికి ఇంట్రెస్ట్ చూపిస్తున్నాడు. భారీ రెమ్యునరేషన్ ఇచ్చి వందల కోట్ల బడ్జెట్ ఖర్చు చేయడానికి మన నిర్మాతలు కూడా రెడీగా ఉన్నారు. చాలా ఏళ్లుగా స్క్రిప్టులు వింటున్నారు కానీ, సరైన కథ కుదరడం లేదు. అయితే ఇన్నాళ్లకు ఓ రెండు స్టోరీలు సెట్ అయినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి.

సూర్యతో సినిమా చేయడానికి స్టార్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తున్నారు. గీతా ఆర్ట్స్ లో బోయపాటి శ్రీనుకి ఇచ్చిన అడ్వాన్స్ అలానే ఉండటంతో, సూర్యతో ప్రాజెక్ట్ సెట్ చేయాలని ట్రై చేసారు. బోయపాటి చెన్నై వెళ్లి స్టోరీ లైన్ కూడా వినిపించారు. దర్శక హీరోలిద్దరూ పలు సందర్భాల్లో ఒకే వేదిక మీద కనిపించడంతో.. సినిమా ఫిక్స్ అయినట్లేనని అంతా భావించారు. కానీ ఎందుకనో ఈ కాంబినేషన్ కుదరలేదు. అయితే ఇప్పుడు చందూ మొండేటి – సూర్య కాంబో కోసం అల్లు అరవింద్ చాలా గట్టిగా ప్రయత్నిస్తున్నారని తెలుస్తోంది.

'కార్తికేయ 2' వంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత, గీతా ఆర్ట్స్ బ్యానర్ లో సినిమా చేయడానికి డైరెక్టర్ చందూ కమిట్ అయ్యారు. రామ్ చరణ్, సూర్య వంటి స్టార్ హీరోలకు కథలు రెడీ చేసారు. ఆల్రెడీ చెర్రీకి ఓ స్టోరీ కూడా వినిపించారు. ఆ తర్వాత సూర్యకు కూడా రెండు ఐడియాలు చెప్పారు. వాటిల్లో ఒకటి హీరోకి నచ్చింది. కానీ చివరకు 'తండేల్' స్క్రిప్టు దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు. అక్కినేని నాగ చైతన్యతో తీసిన ఈ చిత్రం.. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి ఘన విజయం సాధించింది. దీంతో చందు మొండేటి నెక్స్ట్ సినిమా ఏంటనే చర్చ మొదలైంది.

ఇండస్ట్రీలో వినిపిస్తున్న టాక్ ప్రకారం, చందూ రీసెంట్ గా హీరో సూర్యను కలిశాడు. అతడితో కథా చర్చలు ప్రారంభించాడు. అన్నీ అనుకున్నట్లు జరిగితే అల్లు అరవింద్ సమర్పణలో ఈ కాంబో సెట్స్ మీదకు వెళ్తుంది. అయితే చందూ మొండేటి లైనప్ లో 'కార్తికేయ 3' మూవీ కూడా ఉంది. 'కార్తికేయ 2' అప్పుడే దీనికి కొనసాగింపుగా మూవీ ఉంటుందని ప్రకటించారు. కానీ దర్శకుడు ముందుగా సూర్య సినిమాపైనే వర్క్ చేయాలని ఫిక్స్ అయ్యాడట. ఆ తర్వాతే హీరో నిఖిల్ సిద్దార్థ ప్రాజెక్ట్ పట్టాలెక్కుతుందని వార్తలు వస్తున్నాయి.

ఇదంటుంచితే, సూర్యతో సినిమా చేయడానికి సితార ఎంటర్టైన్మెంట్స్ నాగవంశీ కూడా ట్రై చేస్తున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ప్రాజెక్ట్ సెట్ చేయాలని చూస్తున్నారు. 'తొలి ప్రేమ', 'సార్', 'లక్కీ భాస్కర్' వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న వెంకీ.. సూర్యకు లైన్ నచ్చిందని, మారుతి కారు ఇండియాకి ఎలా వచ్చిందనే డిఫెరెంట్ కాన్సెప్ట్‌తో ఉంటుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# శివమణిని మించిపోయేలా ఉన్నాడే!



నటసింహం నందమూరి బాలకృష్ణ తన కెరీర్ లో ఎన్నడూ లేనంత ఫుల్ ఫామ్ లో ఉన్నాడు. 'అఖండ' సినిమాతో సక్సెస్ ట్రాక్ ఎక్కిన ఈ సూపర్ సీనియర్ హీరో.. అక్కడి నుంచి వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. ఓవైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు బసవతారం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంకోవైపు ఎమ్మెల్యేగా హిందూపూర్ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. తాజాగా తలసేమియా బాధితుల కోసం ఏర్పాటు చేసిన ఈవెంట్ కోసం తనవంతు సపోర్ట్ చేసారు. పాట పాడటమే కాదు, డ్రమ్స్ కూడా వాయించి ఫ్యాన్స్ ను ఉత్సాహ పరిచారు.


బాలయ్యకు తొడలు కొట్టడమే కాదు.. డ్రమ్స్ వాయించడం కూడా వచ్చని అంటున్నారు నందమూరి ఫ్యాన్స్. తలసేమియా బాధితులకు సహాయం అందించేందుకు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టాలీవుడ్ సెన్సేషన్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.థమన్ కన్సర్ట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. 'యుఫోరియా' పేరుతో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం సాయంత్రం ఈ మ్యూజికల్ నైట్ జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నందమూరి బాలకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలయ్య డ్రమ్స్ వాయించి ఆడియన్స్ ను అలరించారు.

యూఫోరియా మ్యూజికల్ ఈవెంట్ లో ప్రముఖ డ్రమ్మర్ శివమణి డ్రమ్స్ వాయించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆ సమయంలో స్టేజ్ మీదకు వెళ్లిన బాలకృష్ణ.. శివమణితో కలిసి ఇన్స్ట్రుమెంట్స్ వాయించాడు. ప్రొఫెషనల్ వాయిద్యకారుడిలా బాలయ్య డ్రమ్స్ ప్లే చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇది చూసి నందమూరి అభిమానులు మురిసిపోతున్నారు. బాలయ్యకు సినిమాల్లో యాక్టింగ్ చేయడమే కాదు, మ్యూజిక్ కొట్టడం కూడా వచ్చని కామెంట్స్ చేస్తున్నారు. శివమణిని మించిపోయేలా డ్రమ్స్ వాయించాడని పోస్టులు పెడుతున్నారు. యాంటీ ఫ్యాన్స్ మాత్రం ఎప్పటిలాగే దీనిపై సెటైర్లు వేస్తున్నారు.

పద్మభూషణ్ అవార్డు వచ్చిన తరువాత మొదటిసారిగా బాలకృష్ణ విజయవాడకు రావడంతో, అభిమానులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఇక ఫ్యాన్స్ ను ఉత్సాహ పరచడానికి బాలకృష్ణ తన స్టైల్ లో మైక్ అందుకొని, పాట పాడటానికి స్టేజ్ ఎక్కారు. 'మామా ఏక్ పెగ్ లా' పాట పాడమంటావా? అంటూ అక్కడున్న వారిని నవ్వించారు. చివరకు 'వీర సింహా రెడ్డి' చిత్రంలోని 'సుగుణా సుందరి' అనే సాంగ్ ను ఫీమేల్ సింగర్ తో కలిసి ఆలపించారు.

ఇకపోతే ఇండస్ట్రీలో 50 ఏళ్ళ సినీ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న బాలయ్య.. 60 ఏళ్లకు పైబడిన వయసులోనూ రెట్టింపు ఎనర్జీతో పని చేస్తున్నారు. ఒక సినిమా షూటింగ్ జరుగుతుండగానే ఇంకో చిత్రాన్ని సెట్స్ మీదకు తీసుకొస్తున్నారు. 'అఖండ' 'వీర సింహా రెడ్డి' 'భగవంత్ కేసరి' హ్యాట్రిక్ విజయాలు అందుకున్న బాలకృష్ణ.. మొన్న సంక్రాంతికి 'డాకు మహారాజ్' మూవీతో మరో హిట్ కొట్టారు. ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'అఖండ 2: తాండవం' సినిమాలో నటిస్తున్నారు. ఇది 'అఖండ' చిత్రానికి సీక్వెల్. దసరా పండక్కి రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. దీని తర్వాత గోపీచంద్ మలినేని డైరెక్షన్ లో మరో మూవీ చేయడానికి రెడీ అవుతున్నట్లు సమాచారం.

# ఫస్ట్ టైమ్ లైవ్‌లో సినిమా షూటింగ్



సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటిస్తున్న సినిమా 'మజాకా'. రావు రమేష్, అన్షు మరో జోడీగా కనిపించనున్నారు. త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా మహా శివరాత్రి స్పెషల్ గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఆల్రెడీ ప్రమోషనల్ కంటెంట్ తో సందడి చేస్తున్న ఈ మూవీ ప్రచార కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. షూటింగ్ చివరి దశకు చేరుకోవడంతో, ఓ వినూత్నమైన ఐడియాతో పబ్లిసిటీ చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.

'ఊరి పేరు భైరవకోన' సినిమాతో సక్సెస్ ట్రాక్ ఎక్కిన టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్.. 'మజాకా' మూవీతో ఆడియన్స్ ను అలరించడానికి రెడీ అవుతున్నారు. ఇది అతని కెరీర్ లో ల్యాండ్ మార్క్ 30వ సినిమా. 'ధమాకా' ఫేమ్ త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ బాగానే ఆకట్టుకుంది. మరో పది రోజుల్లో సినిమా థియేటర్లలో విడుదల కాబోతోంది. ఈ చిత్రాన్ని మరింతగా జనాల్లోకి తీసుకెళ్లడానికి చిత్ర యూనిట్ ఓ యునిక్ ఐడియాతో వస్తున్నారు.

తొలిసారిగా సినిమా షూటింగ్‌ను ప్రత్యక్ష ప్రసారం చేయడానికి 'మజాకా' టీమ్ ప్లాన్ చేసింది. 'రావులమ్మ' అనే సాంగ్ షూటింగ్ ను లైవ్ లో చూపిస్తామని మేకర్స్ తాజాగా ప్రకటించారు. రేపు సోమవారం ఉదయం 11.30 గంటల నుంచి షూటింగ్ ప్రత్యక్ష ప్రసారం అవుతుందని తెలిపారు. అలానే చిత్ర బృందంతో చిట్ చాట్ ఉంటుందని సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. హీరో సందీప్ కిషన్ తో సహా మిగతా ప్రధాన నటీనటులు, టెక్నీషియన్స్ ఈ షూట్ లో పాల్గొంటారని తెలుస్తోంది.

ఈ రోజుల్లో సినిమాని జనాల్లోకి తీసుకెళ్లడానికి దూకుడుగా ప్రచారం చేయాల్సి వస్తోంది. టీజర్, ట్రైలర్, సాంగ్స్ ఎంత బాగున్నా.. సినిమాకి మరింత బజ్ తీసుకురావడానికి మేకర్స్ ఏదైనా కొత్త ప్రమోషనల్ స్ట్రాటజీతో పబ్లిసిటీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రెగ్యులర్ ఇంటర్వ్యూలు, ప్రెస్ మీట్స్, ఈవెంట్స్ సరిపోవడం లేదు. అందుకే ఇప్పుడు 'మజాకా' టీమ్ వినూత్న ప్రమోషన్లకు శ్రీకారం చుడుతోంది. సినీ హిస్టరీలోనే ఫస్ట్ టైం సినిమా షూట్ ను లైవ్ లో చూపించబోతున్నారు. మరి ఈ ఐడియా సినిమాకి ఏ మేరకు వర్కౌట్ అవుతుందో చూడాలి.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,